


# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 05 హైదరాబాద్ 2015 సెప్టెంబర్ పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** వార్షిక సభ్యత్వం : రూ.100/-

# విజయనగరం బాబా సెంటర్ 35వ వార్షికోత్సవం

విజయనగరం బాబా సెంటర్ 35వ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబరు 4న అవతారుని ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు శ్రీ కొల్లి రామారావు (94-40-398733) ఒక ప్రకటనలో తెలిపారు.

# భీమ్లీ బాబా సెంటర్ రజతోత్సవాలు

విశాఖపట్నంకు సమీపంలోని భీమునిపట్నం (భీమ్లీ) బాబా సెంటర్ రజతోత్సవాలు 2015 అక్టోబరు 10, 11 తేదీలలో రెండ్రోజులు నిర్వహిస్తున్నట్లు స్థానిక సెంటర్ అధ్యక్షురాలు శ్రీమతి రమ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి ఆశీశ్శులు అందుకోవల్సిందిగా శ్రీమతి రమ (93-93-830480) కోరుతున్నారు. విచ్చేసే బాబా ప్రేమికులు తమ రాకకు సంబంధించిన వివరాలు 30-9-2015 లోగా తెలియజేయవల్సిందిగా ఆమె కోరారు.

# మల్కాజిగిరి

మల్కాజిగిరి బాబా సెంటర్ నూతన భవన ప్రారంభోత్సవం 2015 అక్టోబరు 19, సోమవారం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి శ్రీ పి.పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు.

# నిజామాబాద్

నిజామాబాద్‌లోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో గల మెహెర్‌బాబా సెంటర్ 52వ వార్షికోత్సవం సందర్భంగా 25.10.2015 ఉ. 8 నుండి సా. 6 గం.ల వరకు ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు శ్రీ ఎ. జనార్ధనరావు (99087 85774) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవలిసినదిగా ఆయన కోరుతున్నారు.

# కావలి

కావలి పట్టణంలో శ్రీ సి. హెచ్. ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన గృహ ప్రవేశ సందర్భంగా 16.08.2015న ప్రేమిక సహవాస్ జరిగింది. ఈ సహవాస్‌లో శ్రీ పెరికేడు సింహాచలం, శ్రీ యు. బాపిరాజు, శ్రీమతి సుబ్బలక్ష్మి, శ్రీ పందుగ రమణ, శ్రీ బ్రహ్మారెడ్డి తదితరులు బాబా సత్య ప్రేమ సందేశాలపై ప్రసంగించారు.

# బాబా సందేశం

**నిత్యజీవితంలో దేని గురించి ఆలోచించకుండా,**
**దిగులు పడకుండా గడపడం అలవరచుకుంటే,**
**నా కృప మీకు తప్పక లభిస్తుంది.**

Grace of God can be obtained by trying not to worry

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-6555 3218**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. సాదుసజ్జనుల జన్మస్థానం 6-9
3. చల్లపల్లి బంగారు పండగ 10-11
4. మా మాటలు 12
5. హిందీ సహవాస్ 13-16
6. హృదయంతో దేవుడిని ప్రార్థించండి!! 17-19
7. లార్డ్ మెహెర్ 20-25
8. మార్గెట్ క్రాస్కీ 26-29
9. చాచా మస్తు 30-34
10. బాటసారులు 35
11. బాబా కార్యకర్తలు- 36-38
12. ప్రార్థనలు 39

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# ఖోజాగూడా - మనోనాశ్ కొండ

బాబావారు నిర్వహించిన **నవజీవనం - మనోనాశ్ కార్యక్రమాలను** స్మరించుకుంటూ, ఖోజాగూడాలోని మనోనాశ్ కొండపై **2015 అక్టోబరు 18న, ఆదివారం ఉ. 8 నుండి మ. 2 గంటల** దాకా ప్రత్యేక బాబా సహవాస్ ఏర్పాటు చేశారు.

**అవతార్ మెహెర్‌బాబా 1949 అక్టోబరు 16 నవజీవనం ప్రారంభించారు.** ఈ నవజీవనం అనంతమైనది. ఎవరైతే అసత్యం, ద్వేషం, క్రోధం, లోభం, కామం పూర్తిగా త్యజించి జీవితం గడుపుతారో, ఎవరికీ, దేనికీ భయపడక అంతా భగవంతుని ఇచ్ఛగా భగవంతుని ప్రేమిస్తూ శేషజీవితం గడుపుతారో వారందరిచేత నవజీవనం నిరంతరంగా జీవిస్తుందని మెహెర్‌బాబా తన సందేశంలో పేర్కొన్నారు. బాబావారు గడిపిన నవజీవనంలో భాగంగా 16.10.1951 మనోనాశ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని ఖోజాగూడ కొండపై గడిపారు.

బాబావారు నిర్వహించిన **నవజీవనం - మనోనాశ్ కార్యక్రమాలను** స్మరించుకుంటూ, ఈ ప్రత్యేక సహవాస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, కార్యదర్శి శ్రీ రాజేంద్ర మెహెర్ (98490 46848) తెలిపారు.

# రచనలకు ఆహ్వానం

బాబా సందేశాలపై, మీకు నచ్చిన అంశాలపై మీ రచనలను ఆహ్వానిస్తున్నాం. మీ ప్రాంతాల్లో జరిగే సహవాస్ కార్యక్రమ వివరాలను కూడా మా చిరునామాకు పంపండి. మీ సమాచారం మాకు ప్రతి నెలా 5వ తేదీ లోగా అందేలాగా పంపవల్సింది. **మా చిరునామా..**ఎడిటర్, బాబాస్ హౌస్, గోదావరి గార్డెన్స్, ప్లాట్ నంబరు 32, యాప్రాల్, సికింద్రాబాద్ - 500 087.
ఫోన్ 99595 53218. **ఇ-మెయిల్.** malladisukku@gmail.com.

# హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను నెట్‌లో పంపగలము.**

సంపాదకీయం

# సాగర సంగమమే

సమాజంలో ప్రతిఒక్కరూ హాయిగా సంతోషంగా ఉండొచ్చు.
కానీ, అందరూ సంతోషంగా ఉన్నారా? అంటే,
**లేదనే** జవాబు వస్తుంది. కొందరయితే అనంత దుఖసాగరంలో
ఎప్పుడూ ఈదులాడుతుంటారు. ఇలా ఎందుకు? అని బాబా ప్రశ్నిస్తూ,
అందుకు వివరణ ఇలా ఇచ్చారు. కోరికలు దుఖానికి కారణం అన్నారు.
నిరంతరం ఏదో ఒకటి ఆశించడంవల్ల, కోరికల చిట్టా పెద్దదవుతూనే వుంటుందన్నారు.
ఆ కోరికల వల్ల ఆనందం దూరమౌతుందన్నారు.
ఎవరైతే తమతోటివారిని సంతోషంగా ఉంచాలని కోరుకుంటారో,
తమ కోసమంటూ దేనినీ ఆశించరో, వారెంతో ప్రశాంతంగా, ఆనందంగా వుంటారని
బాబా అన్నారు. తమ తోటివారు ఆనందంగా ఉండాలనుకునేవారికి,
తమకంటూ ఎలాంటి కోరికలు వుండవన్నారు.
భగవంతుడు ప్రతి ఒక్కరిలోనూ వున్నాడు.
ఐతే, ఆ భగవంతుడికి బ్రహ్మచెముడు వుంది.
మీ కోర్కెలు తీర్చమని మీరెంత గట్టిగా మొరపెట్టుకున్నా, ప్రార్థనలు చేసినా
ఆతనికి అవి ఏవీ వినపడవు. మీ హృదయంలో నుండి వచ్చే ఆర్తనాదాన్ని మాత్రమే
భగవంతుడు ఆలకిస్తాడు. మీరు ఇతరుల సంతోషం కోసం, పదిమందికి సహాయం
చేసేందుకు, ఆపదల్లోవున్నవారిని ఆదుకునేందుకు,
మీరు చేసే ప్రతిపని గురించి భగవంతుడికి తక్షణమే తెలుస్తుంది.
మీరు ఇతరుల క్షేమం కోసం చేసే ఎంత చిన్న సహాయాన్నైనా భగవంతుడు గమనిస్తాడు.
ఇతరుల సుఖం కోసం మీరు చేసే ప్రతి పనినీ బాబా హర్షిస్తాడు.
తద్వారా, మీకు ఆనందాన్ని, తృప్తిని పొందుతారు.
ఎన్ని వేలసార్లు ప్రార్థనలు చేసినా, వేలకొలది దేవాలయాల్లో పూజలు చేసినా,
ఎన్నో వేలసార్లు భగవధ్యానంలో గడిపినా, మీకలాంటి ఆనందం, తప్తి లభించదు.
ఎలాంటి ప్రతిఫలాపేక్ష ఆశించకుండా, భగవత్ స్మరణతో, మీరు చేసే ప్రతి పనీ
అవతారునికి అందుతుంది. తద్వారా..మీకు జీవితంలో అమితమైన ఆనందం,
తృప్తితోపాటు మానవ జీవిత లక్ష్యమైన భగవత్ సాన్నిధ్యం తప్పక లభిస్తుంది.
సృష్టిలో ప్రతి ప్రాణి ఆశించేది..భగవదైక్యం!!
**నదులన్నీ సాగరసంగమాన్నే ఆశిస్తాయి.**

❀❀❀

యాత్రా కథనం కుల్దాబాద్.. ...

# సాధుసజ్జనుల జన్మస్థానం

**కుల్దాబాద్** - సాధుసజ్జనులకు జన్మస్థానం.
మహారాష్ట్రలోని ఔరంగాబాద్ పట్టణానికి సుమారు 30 కిమీ దూరంలో
కుల్దాబాద్ వుంది. ఇదొక చిన్న గ్రామం.
ఇక్కడ నుండి ఎల్లోరా గుహలు ఓ 10 కి.మీ కంటే తక్కువ దూరంలో వున్నాయి.
మెహెరాబాద్ నుండి తిరిగి హైదరాబాద్ వస్తూ
ఇటీవల నేను, నా భార్య కుల్దాబాద్‌కు వెళ్ళాం.
ఇలా ఎందుకు వెళ్ళామంటే, అందుకు జవాబుగా ఈ వ్యాసం ఆసాంతం చదవండి!!
మీకే తెలుస్తుంది ఆ విశేషం!! !!
1940–1950 మధ్యకాలంలో మెహెర్‌బాబా కుల్దాబాద్‌ను తన మండలివారితో
అనేకసార్లు పర్యటించారు. 1952 నవంబరులో మెహెర్‌బాబా నవజీవన సమయంలో



సద్గురువు జర్ జరి జార్ బక్షి సమాధి

కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.
అనేకమంది సత్పురుషులకు కుల్దాబాద్ జన్మస్థానమని మెహెర్‌బాబా ప్రకటించారు.
14వ శతాబ్దం నాటికే, ఈ గ్రామం చుట్టూతా,
సుమారు 1400 వంది సాధుసజ్జనుల సమాధులున్నాయని బాబా అన్నారు.
కుల్దాబాద్‌లో వున్న ఒక చిన్నకొండపైన వున్న గుహలో
మెహెర్‌బాబా పలుమార్లు ఏకాంతవాసం చేశారు.
ఈ కొండ గుహ ఇంచుమించు ఖోజాగూడా మనోనాశ్ గుహను పోలి వుంది.
మెహెర్‌బాబా, అలాగే షిరిడి సాయిబాబా కూడా ఈ కొండ గుహలో
పలుసార్లు ఏకాంతవాసం చేశారు. కొండకు దిగువున షిరిడి సాయిబాబా గురువైన
**సద్గురువు జర్ జరి జార్ బక్షి** సమాధి వుంది. ఈ సమాధిని కూడా మెహెర్‌బాబా
పలుమార్లు సందర్శించి, తన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సమాధి దర్శనానికి మన దేశం నుండే కాకుండా పాకిస్థాన్ నుండి కూడా
చాలామంది భక్తులు వస్తుంటారు.
**సద్గురువు జర్ జరి జార్ బక్షి** సుమారు 600 సంవత్సరాల క్రితం వాడు.
షిరిడి సాయి 1918లో భౌతిక దేహం చాలించాడు.
మరి అలాంటప్పుడు, సాయినాధునికి **సద్గురువు జర్ జరి జార్ బక్షి** గురువు ఎలా
అవుతాడని? పాఠకులకు సందేహం రావచ్చు. ఇది నిజమే!!
**ఆరు శతాబ్దాల క్రితం సద్గురువు జర్ జరి జార్ బక్షి సేవలు చేసుకున్న సాయినాధునికి
ఆ తదనంతరం 19వ శతాబ్దంలో సద్గురువు స్థాయి ఆధ్యాత్మిక ప్రగతి కలిగించాడని,
సాక్షాత్తూ మెహెర్‌బాబా తన మండలికి పలు సందర్భాలలో చెప్పారు.**
మండలి సభ్యుడు, మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహితుడైన ఏరుచ్ ఈ విషయమై
ప్రస్తావన వచ్చినప్పుడు మాట్లాడుతూ, సాయిబాబా చరిత్రలో కానీ,
సాయి కథనాలలో కూడా ఈ విషయం ఎక్కడా చెప్పలేదని అన్నారు.
స్థానికులకు కూడా ఏ కొద్దిమందికో కానీ తెలియదని ఏరుచ్ అన్నారు.
ఇక్కడే కొండ దిగువకు ఓ ప్రక్కగా, తెల్లని గోపురంతో మరో సమాధి వుంది.
ఈ సమాధిని కూడా మెహెర్‌బాబా అనేక సార్లు సందర్శించారు.
ఒక సందర్భంలో ఈ సమాధి ప్రధాన ద్వారం ముంగిట బాబా
సుమారు వెయ్యిసార్లుకు పైగా మోకరిల్లారు. భక్తితో ప్రణమిల్లారు.
ఈ సమాధి ఒక గొప్ప సద్గురువు యొక్క తండ్రిదని బాబా వివరించారు.
అంతకుమించి ఆయన ఎక్కువగా చెప్పలేదు.
అలాగే ఆయన ఈ సమాధికి వెయ్యిసార్లు ఎందుకు ప్రణమిల్లారో కూడా
బాబా చెప్పలేదని, ఆనాడు బాబాతోనే వున్న ఏరుచ్ వివరించారు.

ఇక్కడకు సమీపంలోనే ఓ పాడుపడిన మసీదు వుంది.
ఈ మసీదు ప్రాంగణంలో బాబా తన మండలివారితో ఒక వారం రోజుల పాటు వున్నారు. బాబా ఇక్కడవున్న సమయంలో పగటిపూట మస్తుల సాంగత్యం చేశారు. కుష్టు రోగుల పాదాలు కడిగి దక్షిణ ఇచ్చారు.
కుల్దాబాద్‌లో మరో విశేషం ఏమంటే, ఔరంగజేబు సమాధి వుంది.
మొఘలు సామ్రాజ్య చక్రవర్తి ఔరంగజేబు గొప్ప పరాక్రమవంతుడిగా చరిత్రలో కీర్తిగడించాడు. అలాగే, ఆయన గొప్ప ఆధ్యాత్మిక చింతనాపరుడని చాలా కొద్దిమందికి తెలుసు. ఆయన తన జీవిత ఆఖరి రోజుల్లో మసీదులో ప్రార్థనలు జరిపే సమయంలో ముస్లింలు వాడే రూమీ టోపీలను కుట్టి, వాటిని అమ్మగా వచ్చిన ఆదాయంతో కడు నిరాడంబర జీవితం ఔరంగజేబు చక్రవర్తి గడిపాడని చరిత్రకారుల రాతలు తెలియజేస్తున్నాయి. ఎంతో నిరాడంబరంగా వున్న ఔరంగజేబు సమాధిని మనం కుల్దాబాద్‌లో చూడొచ్చు. ఔరంగజేబు భార్య సమాధి ఒక చిన్నసైజు తాజ్‌మహల్ రీతిలో ఔరంగాబాద్ పట్టణంలో వుంది. దీన్ని **బీబీ కా మక్‌బారా** అని పిలుస్తారు.
ఇకపోతే, కుల్దాబాద్ నుండి ఎల్లోరా గుహలు సుమారు 10 కిమీ దూరంలో వున్నాయి. బాబా తరచు తన మండలివారితో ఈ ప్రాంతాన్ని సందర్శించేవారని ఏరుచ్ చెప్పారు. ఎల్లోరా గుహల గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది.
పాఠకులలో చాలామంది ఇప్పటికే ఎల్లోరాలోని మూడు అంతస్థుల్లోవున్న మొత్తం 34 గుహలు చూసేవుంటారు.
ఇక్కడ 16వ గుహలో వున్న కైలాస్ దేవాలయాన్ని బాబా ఎంతో ఇష్టంగా దర్శించేవారని మండలి సభ్యులు చెప్తారు. సుమారు 10 అంతస్తుల భవనం ఎత్తులో వున్న కైలాస్ దేవాలయ ప్రాంగణాన్ని ఆనాటి శిల్పి తన ఉలి కదలికలతో అలరారించాడు. మెహెర్‌బాబా ఈ ప్రాంతాన్ని ఎంతో ప్రేమతో అనేకమార్లు దర్శించారు.

# గ్లో పత్రికలో వ్యాసం

మే 1994 గ్లో మాస పత్రికలో ఓ యాత్రా కథనంగా

**VISITING THE WOMB OF SAINTS**

శీర్షికతో పాశ్చాత్య బాబా ప్రేమికుడు శ్రీ బిల్ స్టీఫెన్స్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రచురించారు. 1974 జనవరి 4న మెహెరాజాద్ నుండి మండలి సభ్యుడు ఏరుచ్ నేతృత్వంలో ఒక బస్సులో సుమారు 49 మంది ప్రేమికులతో ఈ ప్రాంతాన్ని సందర్శించారని, ఔరంగాబాద్, కుల్దాబాద్‌లలో బాబా పర్యటించిన అనేక ప్రాంతాల విశేషాలు ఏరుచ్ తెలియజేశాడని ఆ వ్యాసంలో తెలియజేశారు.

ఈ పర్యటనలో మొత్తం 25 మంది పాశ్చాత్య బాబా ప్రేమికులు,
మిగిలినవారందరూ ముంబాయి, పూణే, అహ్మద్‌నగర్‌ల నుండి వచ్చినవారు పాల్గొన్నారు.
అలోబా, జాల్‌భాయ్ కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు.
వీరందరూ ఉదయాన్నే 6 గంటలకు మెహెరాజాద్‌లో బయల్దేరి ముందుగా మెహెరాబాద్
నుండి 10 కిమీ దూరంలో వున్న ఇమాంపూర్ దగ్గర గల మసీదును దర్శించుకున్నారు.
మెహెర్‌బాబా 1952లో నవజీవనం ఆఖరి రోజులలో, తమ తిరుగు ప్రయాణంలో
ఇమాంపూర్ దగ్గరున్న మసీదులోనే తనతో వున్న నల్గురు సహచరులతో కలిసి
రాత్రి బస చేశారు. ఇందుకు సంబంధించి ఆనాటి విశేష కథనాలు పాఠకులకు
తెలుసు. ఆ తర్వాత అక్కడ నుండి టోకా గ్రామాన్ని చేరారు.
1928 జూన్‌లో మెహెర్‌బాబా టోకాలో తన ఆశ్రమాన్ని నెలకొల్పారు.
మెహెరాబాద్‌లో తనతో వున్న ఆశ్రమవాసులతో పాటు ప్రేమాశ్రమ విద్యార్థులు అందరితో
కలిపి రమారమిన 500 మందితో మెహెర్‌బాబా టోకాలో ఆశ్రమాన్ని నిర్వహించారు.
ఆ దరిమిలా, నవంబరు 1928లో ఈ ఆశ్రమాన్ని మూసివేసి తిరిగి మెహెరాబాద్
చేరుకున్నారు. గోదావరి, ప్రవర నదుల సంగమ ప్రాంతం **టోకా**.
ఇక్కడ కొన్ని క్షణాలు గడిపి ఆ తర్వాత ముందుగా ఔరంగాబాద్,
ఆ తర్వాత కుల్దాబాద్‌కు చేరుకుని ఇక్కడ గల అనేక ఆధ్యాత్మిక సంపదను దర్శించుకుని,
సాయంత్రం చీకటిపడే సమయానికి ఆ బృందం మెహెరాబాద్‌కు చేరుకున్నారు.
ఈ సమయంలో ఏరుచ్ చెప్పిన అనేక ఆసక్తికర విషయాలను,
ఆనాడు మెహెర్‌బాబా వారితో చెప్పిన సంగతులను పూసగుచ్చినట్లు ఆ యాత్రలో
పాల్గొన్నవారికి తెలియజేశాడు. ఆ విషయాలన్నీ కళ్ళకుకట్టినట్లు యాత్రాకథనంగా
పాశ్చాత్య బాబా ప్రేమికుడు శ్రీ బిల్ స్టీఫెన్స్ గ్లో పత్రికలో రాసిన వ్యాసాన్ని చదివినప్పటి
నుండి ఈ పవిత్ర ప్రదేశాన్ని చూడాలని నేనెంతో తహతహలాడాను.
సుమారు దశాబ్దం పైబడిన తర్వాత ఇప్పటికి ఈ అద్భుత ఆధ్యాత్మిక ప్రదేశం చూడడానికి
నాకు అవకాశం కల్గింది. పాఠకులలో నాలాగే ఇంకా చూడనివారుంటే, మీ వీలునుబట్టి,
ఈ దఫా మెహెరాబాద్‌కు వెళ్ళినప్పుడు ఈ ప్రాంతాన్ని సందర్శించే ప్రయత్నం చేయగలరు.
అవతారుని పాద స్పర్శతో పునీతమైన ఈ ప్రాంతాన్ని ఒక్కసారైనా సందర్శించాలనుకోవడం
బాబా ప్రేమికులందరికీ సంతోషకరమైన విషయమే కదా!!



**శ్రీ బుదే క్రిష్ణయ్య,**
**సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (రిటైర్డ్)**
**099-08-210580**

# చల్లపల్లి బంగారు పండగ




కృష్ణాజిల్లా చల్లపల్లి బాబా కేంద్రం స్థాపించి ఐదు దశాబ్దాలు నిండిన సందర్భంగా 2015 ఆగస్టు 29, 30 తేదీలలో స్వర్ణోత్సవ సంబురాలు బహు కన్నుల పండుగగా జరిగాయి. తొలి రోజున స్థానిక బాబా కేంద్రంలో ఉదయం 7 గంటలకు ప్రార్థనలు చేశారు. అనంతరం పురవీధులలో ఊరేగింపుగా విశాలమైన సభాప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ బాబావారి సప్తవర్ణ పతాకావిష్కరణ చైర్మన్, అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు, శ్రీ శ్రీధర్ కేల్కర్ చేశారు. సహవాస్ కార్యక్రమాన్ని తమదైన శైలిలో శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీ ప్రసాదరాజులు నిర్వహించారు. ముఖ్య అతిధిగా రాష్ట్ర శాసనసభ డెప్యూటి స్పీకర్ శ్రీ మండలి బుద్ధప్రసాద్ హాజరయ్యారు. స్వర్ణోత్సవ సావనీరును ఆయన అవిష్కరించారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన సుమారు 1500 మంది ప్రేమికులు హాజరయ్యారు.

శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, బందరు, అతిధులకు స్వాగతం పలికారు.

శ్రీమతి సి.హెచ్. మెహెరా స్వాగత నృత్యం చేశారు. కేంద్ర అధ్యక్షులు

శ్రీ చుండూరు నాగేశ్వరరావు స్వాగతోపన్యాసం చేశారు. సహవాస్ కార్యక్రమాలకు హాజరవడం ద్వారా బాబా ప్రేమికులలో నూతనోత్సాహం కలుగుతుందని, బాబా ప్రేమికులు అవతారుని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని శ్రీ బి. రామక్రిష్ణయ్య అన్నారు. చల్లపల్లి సెంటర్ కార్యదర్శి, శ్రీ పి.వి. రమణారావు తమ నివేదికను చదివి వినిపించారు. పలువురు యువ బాబా ప్రేమికలు నృత్యకార్యక్రమాన్ని నిర్వహించారు. వారిలో ముఖ్యంగా కుమారి చందూరు మెహెర్ రాణి, కుమారి కె.యం.ఎల్. సౌజన్య, కుమారి హరిణి, కుమారి మెహెర్ మణి, గోదావరిఖని, కుమారి మెహెర్ సంప్రీతి, శ్రీ కామేశ్వరరావు గారి దర్శకత్వంలో మెహెర్ విద్యానికేతన్, శ్రీకాకుళం విద్యార్థుల నృత్య రూపకం సభికుల్ని అలరించాయి. జొన్నాడ బాబా సెంటర్‌వారు కోలాటం చేశారు. గుంటూరు బాబా సెంటర్ ప్రేమికలు శ్రీ బి.వి. సుబ్బారావు, **'బైదుల్ వైద్యం'**శీర్షికతో కడుపుబ్బ నవ్వించే హాస్య వాటికను ప్రదర్శించారు. శ్రీమతి యం. సత్యవతి & పార్టీ, విజయవాడ, **'కర్మకాండలు' అనే**

**అంశంపై లఘు నాటిక ప్రదర్శించారు.** చల్లపల్లి సెంటర్ విశిష్ఠత గురించి క్లుప్తంగా డా. బి. కేశవరావు తెలిపారు. 1965 ఆగస్టు 29న చల్లపల్లి సెంటర్‌ను ఒక అద్దె భవనంలో శ్రీ తోట ధనపతిరావు నాయుడు ప్రారంభించారన్నారు. శ్రీ ఎస్.ఆర్.వై. రామకృష్ణ ప్రసాద్, అధ్యక్షులుగా, శ్రీ బి.హెచ్.వి. రమణారావు, కార్యదర్శిగా చల్లపల్లి కేంద్రాన్ని అనేక బాబా సెంటర్లకు ఆదర్శంగా చాలాకాలంపాటు నిర్వహించారు. కాగా, బాబా కార్యదర్శి మరియు శిష్యుడు శ్రీ ఆది.కె.ఇరానీ, అవతారుని సేవలో తరించిన డా॥ హెచ్.పి. భరూచా, శ్రీ గులాబ్‌దాస్ పాంచాల్ వంటి బాబావారి ప్రేమికులను చల్లపల్లి సెంటర్‌కు ఆహ్వానించి, వారిద్వారా బాబా సందేశవ్యాప్తికి కృషిచేశారని అన్నారు. ప్రేమతో ఎంతో దూరాభారంతో చల్లపల్లి సహవాస్‌కు హాజరయిన ప్రతివారికీ స్వాగత ప్రేమ ధన్యవాదాలను ప్రొఫెసర్ కేశవరావు తెలియజేశారు. ఈ రెండు రోజుల బంగరు పండుగ వేడుకలలో పలువురు వక్తలు వరుసగా శ్రీ జాల్ పి.దస్తూర్, శ్రీ మెహెరీశ, చెన్నై, శ్రీమతి జి. సుబ్బలక్ష్మి, శ్రీ జి.ఎస్. దుబే, శ్రీ దాసరి హేమనాథ్, శ్రీ కిలారి నాగార్జున, తిరుపతి, శ్రీమతి శివనాగేశ్వరి ప్రసాద్, శ్రీ మెహెర్ వెంకట్, శ్రీ జి. వెంకటేశ్వరరావు, కె.సి.పి. లిమిటెడ్, ల శ్రీ కె.యం. కృష్ణారావు, బి. కృష్ణయ్య తదితరులు అవతారుని సందేశాలపై అనర్గళంగా ప్రసంగించారు. ఈ సంబురాలలో చుండూరివారి ఆతిధ్యం మరో స్వర్ణోత్సవం దాకా తమకు యాదికుంటుందన్నారు హైదరాబాద్ నుండి వెళ్ళిన అనేకమంది బాబా ప్రేమికులు.

**........పి.యస్.కె. శర్మ, హైదరాబాద్**



శ్రీమతి సత్యవతి




# బాబాలో ఐక్యం

శ్రీ మల్లిపూడి పనసన్న గారి భార్య శ్రీమతి సత్యవతి 2015 ఆగస్టు 13న తెల్లవారుఝూమున 4 గంటల ప్రాంతంలో బాబాలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. ఆగస్టు 23న వారింట బాబా సత్సంగ్ కార్యక్రమం నిర్వహించామని వారు తెలిపారు.

# శ్రీకాకుళం సెంటర్ 54వ వార్షికోత్సవం

శ్రీకాకుళం సెంటర్ వార్షికోత్సవం 2015 ఆగస్టు 23న ఘనంగా నిర్వహించినట్లు కార్యదర్శి శ్రీ పి.వి.రంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీ లక్ష్మీనరసింహం సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించి సహవాస్‌ను ప్రారంభించారు. శ్రీ ధర్మసాగర్, హైదరాబాద్, శ్రీ కేశవరావు, విజయవాడ, శ్రీ పి. భాస్కరరావు, శ్రీకాకుళం, తదితరులు బాబా సత్యప్రేమ సందేశాలపై ప్రసంగించారు.
ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, ఉచిత నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలకు ఎడిటర్, మెహెర్‌బాబా, **995 955 3218**ని సంప్రదించగలరు.

# ముత్తా గారికి హ్యాపీ బర్త్‌డే

బాబా ప్రేమికులు శ్రీ ముత్తా శ్రీరామమూర్తి, కొండప్రోలు, పశ్చిమ గోదావరి జిల్లా వారి 90వ జన్మదినోత్సవాన్ని అవతార్ మెహెర్‌బాబా తాడేపల్లిగూడెం సెంటర్‌లో బాబా ప్రేమికల సమక్షంలో, అవతారుని సత్సంగ్ నడుమ ఘనంగా జరిపినట్లు స్థానిక సెంటర్ కార్యదర్శి డాక్టర్ విజయసారధి ఒక ప్రకటనలో తెలిపారు.

# హిందీ సహవాస్

ఇప్పటి దాకా కపటం గురించి చెప్పాను. ఇకపై మహత్యాలు గురించి మాట్లాడుకుందాం!!
నన్ను ప్రేమించేవారికి, నా గురించి, నా విధానాల గురించి
తెలుసుకోవాలనుకునేవారందరికీ – ఇది చాలా ప్రాధాన్యమైన విషయం.
నాకు నిత్యం అనేక మంది – ప్రపంచం నలుమూలల నుండి ఉత్తరాలు రాస్తుంటారు.
బాబా నీ దయవల్ల నా బిడ్డ బ్రతికింది.
ఫలానా అపాయం నుండి నీ దయవల్ల బయటపడ్డాను.
ఇదిగో... ఈ మాదిరిగా నేను చేసిన మహత్యాల గురించి గొప్పగా వర్ణిస్తూ
నా ప్రేమికులు చాలామంది ఉత్తరాలు రాస్తుంటారు.
ఐతే, ఈ విషయంలో నేనొకటి చాలా స్పష్టంగా చెప్పదల్చాను.
ఇంతక్రితం జరిగిన తెలుగు, గుజరాతీ సహవాసీయులకు కూడా
ఈ విషయమై నేను చాలా స్పష్టంగా చెప్పాను.
మరలా మరలా నేను చెప్పేదేమంటే – దైవీ మానవుడిగా నేను మీ మధ్యకు వచ్చిన
తర్వాత, నేనింత వరకు ఎలాంటి మహత్యం చేయలేదు.
నేను చేపట్టిన **ఈ మౌనం వదిలిపెడితే** అదొక గొప్ప మహత్యం అవుతుంది.
అదే మొదలు – చిట్టచివరి మహత్యంగా నిలుస్తుంది.
ఎన్నో యుగాల క్రితం – నేనొక మహత్యం చేశాను.
**ఈ యావత్తు సృష్టి నా మహత్యం వల్లనే వచ్చింది.**
అలాగే, ఈ అవతారకాలంలో నేను తిరిగి మాట్లాడటం, నా మౌన విరమణ
మరో గొప్ప మహత్యంగా నిలుస్తుంది.
ఇక నా ప్రేమికులు ఫలానా మహత్యం మాకు జరిగిందని లేఖలు రాస్తున్నారే,
అదేదో వారికి నా ఎడల గల ప్రేమ, నమ్మకమే గానీ
అవేవీ నా మహత్యం వల్ల ఏమీ కాదు.
హమీర్‌పూర్‌కి చెందిన కేశవ్‌నారాయణ్ నిగం ఇటీవల ఒక ఉత్తరం రాశారు.
ఒక చంటి పిల్ల వారి ఊర్లో అనారోగ్యంతో చనిపోయింది.
ఐతే, హమీర్‌పూర్‌లోని రాం దాస్ అనే నా ప్రేమికుడు నా నామస్మరణ, భజన
నిరంతరాయంగా, అలుపెరగకుండా చేయడం వల్ల,
చనిపోయిందనుకున్న ఆ పిల్ల తిరిగి శ్వాస తీసుకోవడం ప్రారంభించింది.
ఇది నిజంగా నీవు చేసిన మహత్యం వల్లనే ఆ చనిపోయిన బిడ్డ తిరిగి
ప్రాణం పోసుకుంది బాబా అన్నారు.

వాళ్ళ ఇంట్లోని వారందరి ముఖాల్లో నవ్వులు వెల్లివిరిసాయి అని గొప్పగా
కేశవ్ నాకొక లేఖ రాశాడు. అది కూడా కేశవ్ – రాం దాస్‌లకు నాయందు
గల ప్రేమ – విశ్వాసమే కానీ, నేను చేసిన మహత్యం ఏమీ కాదు.
ఆ తర్వాత బాబా ఆదేశాల మేరకు శ్రీ కేశవ్ నారాయణ్ నిగం హమీర్‌పూర్‌లో జరిగిన
ఆ ఉదంతాన్ని కళ్ళకుకట్టినట్లు సహవాసీలందరికీ వివరించాడు.
తర్వాత బాబా మాట్లాడుతూ ఆ చంటి పిల్ల బ్రతికిందంటే నా మహత్యం వల్ల
ఏమాత్రం కాదు. మీ ప్రేమ వల్ల ఆ బిడ్డ తిరిగి ప్రాణం పొంది వుండవచ్చు.
ఏదైనప్పటికీ ఇదంతా అప్రధానం. ఇదేమీ గొప్ప విషయమేమీ కాదు.
నా ప్రేమలో మీలో ఎవరైనా మరణించడం గొప్ప అవుతుందని గుర్తుంచుకోమని
హెచ్చరించారు. ఇకపై జాగ్రత్తగా వుండండన్నారు.

***

నిరంజన్ సింగ్ కేసి బాబా చూస్తూ – నిన్ను ఓ గంట నడుం వాల్చమని చెప్పాను.
నీవు నా మాట వినకుండా ఇక్కడకు వచ్చి బిగ్గరగా ఆవలిస్తున్నావ్!! అని చమత్కరించారు.

***

చనిపోయిన బిడ్డ తిరిగి బ్రతికిందన్న సంఘటనకు సమాంతరంగా
మరో వాస్తవ సంఘటనతో పోల్చుతూ బాబా ఇలా అన్నారు.
ఆఖరి క్షణాల్లో నా నామం తలుచుకుంటూ ఎవరు తనువు చాలిస్తారో
వారు నన్ను వచ్చి చేరతారని బాబా ప్రకటించారు.
బొంబాయిలో వుండే నౌరోజీ దాదా ఛాంజీ,
ఆయన కుటుంబ సభ్యులు, బాబా ఎడల వారికి గల అవ్యాజ ప్రేమ గురించి
బాబా ఇలా వివరించారు. నౌరోజీ భార్య చనిపోయింది.
ఆ తర్వాత క్రమంలో అతని చిన్న కొడుకు చనిపోయాడు.
ఆ తర్వాత మరో కొడుకు నౌజర్ విమాన ప్రమాదంలో చనిపోయాడు.
యావత్తు కుటుంబం నౌజర్ నెలసరి ఆదాయంపై ఆధారపడతారు.
ఇదలావుంటే యావత్తు కుటుంబం నన్ను అమితంగా ప్రేమిస్తుంది.
నౌజర్ హైదరాబాద్ దగ్గర వున్న హకీంపేట ఎయిర్ ఫోర్స్ అకాడమీలో
ట్రైనీ పైలట్‌గా పనిచేస్తున్నాడు.
ఒకరోజున అతను నడుపుతున్న విమానం ప్రమాదానికి గురైంది.
విమానం, అలాగే దాన్ని నడుపుతున్న పైలట్‌ల జాడ కానరాలేదు.
వారు ఈ విషయం నాకు తెలియజేస్తూ టెలిగ్రాం పంపారు.
నేను వారికి జవాబు వెంటనే పంపాను.

ఐదు రోజుల్లోగా నౌజర్ మృత దేహం జాడ కనపడితే,
అతడిని నేరుగా మెహెరాబాద్‌కి తీసుకురమ్మనమన్నాను.
ఈ సంఘటన జరిగినప్పుడు నేను పూణే గురుప్రసాద్ బంగళాలో వున్నాను.
వారంరోజుల తర్వాత విమానం, అలాగే నౌజర్ మృతదేహం
గండిపేట చెరువులో కనబడ్డాయి.
నాకు ఈ విషయాలు తెలియజేయడానికి వారు ఇబ్బందిపడ్డారు.
పూణే గురుప్రసాద్‌లో వున్న నా విశ్రాంతికి భంగం వాటిల్లుతుందని వారు భావించారు.
అదే నా నిజమైన చమత్కారం.
ఇది వారికి నా ఎడల గల ప్రేమ - విశ్వాసానికి నిదర్శనం!!
నా హమీర్‌పూర్ పర్యటనలో ఒక గుడ్డివాడైన బాలుడుకి తిరిగి కంటి చూపు వచ్చిందని చెప్పారు. ఈ సంఘటనతో కూడా తనకెలాంటి సంబంధం లేదని బాబా అన్నారు.
నేను అవతారుడిని. నేనిలా మట్లాడ్డం తగదు సుమీ!! అన్నారు బాబా.
ఆ తర్వాత మహిళల కోసం త్వరలో ఏర్పాటు చేయబోయే సహవాస్
గురించి సహవాసీలతో ముచ్చటించారు.
ఈ విషయాల్ని ఇంతక్రితం మెహెరాబాద్‌లో జరిగిన గుజరాతీ -
తెలుగు సహవాస్‌లలో చర్చించాం అంటూ - నాకు స్త్రీ - పురుష బేధం లేదు.
ప్రేమ ఎక్కడ వుంటే - నేను అక్కడ వుంటాను.
బాబా కార్యక్రమాల ప్రాముఖ్యత ప్రస్తావిస్తూ -
మీరు నన్ను ప్రేమించండి!!
నన్ను అధికాధికముగా, ఇంకనూ అధికముగా ప్రేమించమని,
ఆ మాదిరిగా భగవంతుడిని ప్రేమించాలని
ఇతరులకు నా ప్రేమ గురించి చెప్పమని చెబుతున్నాను.
తిరిగి ఈ విషయాన్నే మరలా చెబుతున్నాను.
శ్రద్ధగా ఆలకించండి.
మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి.
మీ హృదయాన్ని అడగండి.
నన్ను ప్రేమించే అర్హత మీకు ఉందో లేదో ముందుగా తెలుసుకోండి.
ఉదాహరణకు - బాబూ రాంప్రసాద్‌ను తీసుకోండి.
అతను నా ప్రేమ సందేశం గురించి చాలా చక్కగా మాట్లాడతాడు.
మెహెర్‌బాబా సాక్షాత్తూ ఈ యుగావతారుడు,
మెహెర్‌బాబా పురాణ పురుషుడు అని గట్టిగా గొంతెత్తి ప్రకటిస్తాడు.
మెహెర్‌బాబా కనుసన్నలలోనే ప్రతి ఒక్కటీ జరుగుతుందని,

ఎటువంటి పరిస్థితుల్లోనూ చలించిపోరాదని – బాబా మాటలుగా పలువురికి చెప్తాడు.
బాబా ఒక్కడే సత్యం, శివం, సుందరం!!
మిగిలినదంతా మిధ్య.
బాబా ఇచ్ఛ లేనిదే చెట్టుకున్న ఆకు కూడా అటూ – ఇటూ గాలికి కదలదు.
బాబాను నిత్యజీవితంలో మీ సహచరునిగా స్వీకరించండి.
బాబాని ప్రేమించడం అలవరుచుకోవాలి!!
ఇదీ బాబూ రాంప్రసాద్ సుధీర్ఘ, అనర్గళంగా చేసే
ప్రసంగం పాఠవం. ఈ ప్రసంగం ధారాళంగా కొనగాగుతుంది.
ఐతే, ఇంతలో, అతను వేదికపై ప్రసంగిస్తుండగానే,
తన ఇంట్లో పది వేల రూపాయలు దొంగతనం జరిగిందన్న
కబురువచ్చిందనుకోండి.
ఈ సమయంలో బాబూజీ ముఖ కవిలికలు గమనించండి.
ఒణికిపోతూ బిగ్గరగా రోదించడం మొదలిడితే,
అప్పటిదాకా, వేదికకు ఎదురుగా కూర్చుని, ఆయన ప్రసంగం ఆలకించిన
వారందరూ అతని గురించి ఏమనుకుంటారు?
బాబా సత్యప్రేమ సందేశాలపై వారేమనుకుంటారు.
బాబూజీదంతా వ్యర్ధ ప్రసంగం అనుకోరూ!!
మీరు చూస్తున్నదంతా మాయ –
అంతా మిధ్య అని అప్పటి దాకా ధారాళంగా ప్రసంగించిన బాబూరాంప్రసాద్
గురించి ఏమనుకుంటారు.
ఐతే, ఆ జరిగిన దొంగతనం సమాచారంతో బాబూజీ ఏమాత్రం కలత చెందకుండా,
తన ప్రసంగం కొనసాగిస్తే, వేదిక ఎదురుగా వున్న సభికులు
బాబూజీలోని నిజమైన బాబా ప్రేమను కొంతవరకైనా నమ్మగల్గుతారు.
మీ జీవితాలే – బాబా ప్రేమ సందేశాలుగా తీర్చిదిద్దుకోవాలి!!

**make your very life itself the message of My love to others.**

నిజమైన బాబా ప్రేమికుడు ఒక్కడున్నా – అతను పదివేలమంది ప్రేమికులను
తయారుచేయగలడన్నారు. అనంతరం టీ విరామం ప్రకటించారు.
తిరిగి మండలిహాల్లోకి సమావేశమయ్యాక, బాబా ప్రసంగిస్తూ, నా చిత్రపటాలు –
లాకెట్లు – వగైరా చాలామంది కొనుగోలు చేశినట్లుంది. నా ఫోటోతోపాటు,
నన్ను మీ హృదయంలో నింపుకుని, పదిలంగా మీ ఇళ్ళకు మీ తిరుగు ప్రయాణంలో
తీసుకెళ్ళండని హితవు చెప్పారు.

**– సశేషం**

# హృదయంతో దేవుడిని ప్రార్థించండి !!

భగవంతుడిని ఎలా ప్రార్థించాలి? భగవంతునికి ప్రార్థనలు అవసరమా?
ఈ విషయాలపై బాబా ఒక సందర్భంలో తన ప్రేమికులతో ఇలా అన్నారు.
భగవంతుడు మీ హృదయంలో పదిలంగా వున్నాడు.
హృదయంతో ఆ దేవదేవుడిని ప్రేమించండి!! ఆరాధించండి! మనసారా ప్రార్థించండి.
దేవుడిని ప్రార్థించే సమయంలో మీ హృదయంలోకి
ఎలాంటి ఆలోచనలు రానివ్వద్దు.
సాధారణంగా... దేవుడిని ప్రార్థించడమంటే,
బాబా.. నీ దయ, కరుణ మాపై ప్రసరింపజేయి!!
మంచి ఆరోగ్యం, ఉద్యోగం, మంచి జీవితం..ఇంకా ఇలా ఇలా ఎన్నో.... ప్రసాదించు.
ఆశీర్వదించు బాబా అంటూ,
మీ కోర్కెల చిట్టా మీ ప్రార్థనలో చొప్పిస్తారు.
ఇది ప్రార్థన అవుతుందా? అన్నారు బాబా.
ఎలాంటి కోర్కెలు లేకుండా, ప్రార్థనా సమయంలో
భగవంతుని నామాన్ని స్తుతించాలి. భక్తుడు భగవన్నామ స్మరణలో తరించాలి.
**మీరు చూస్తున్న ఈ ప్రపంచం నిజం కాదని,**
**ఇదంతా మిథ్య అని తెలుసుకున్నాక కూడా....**
**ఇంకా మాకు అది కావాలి..**
**ఇది కావాలని కోరుకోవడంలో**
**అర్థమేమైనా వుందా? అని బాబా ప్రశ్నించారు.**
**"THE REAL PRAYER TO GOD IS PRAISE FOR HIM THROUGH LOVE AND NOTHING ELSE. WHEN YOU KNOW YOU ARE IN ILLUSION, WHY KEEP ASKING FOR MORE OF IT?"**
ఈ విషయమై తన మండలి ప్రేమికుడిని ఒక కథ చదివి వినిపించమన్నారు.
ఆ కథ ఇలా వుంది. మన నిత్యజీవితంలో ఇలాంటి వ్యక్తులు
మనకు చాలామంది తారసపడతారు కూడా...
బాబా ప్రేమికులుగా ఈ కథను నిశితంగా పరిశీలించండి.
ఈ కథకు ముగింపు మీరు చెబితేనే బాగుంటుంది.
ముగింపు మేం ప్రస్తావించడం లేదు.
గమనించండి...

## బిక్షగాడు కథ

అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో ఒక బిక్షగాడు ఉన్నాడు.
స్థానికంగా ఊర్లో వున్న దేవుని గుడి ఎదురుగా కూర్చునేవాడు.
భక్తులు అడపాదడపా వేసే ప్రతిపైసా భిక్షనీ తన జీవనం కోసం కూడబెట్టేవాడు.
కొద్ది రోజులయ్యే సరికి ఆ పైసలు అన్నీ కలిపితే నూరు పైసలయ్యాయి.
ఆ పైసలన్నింటినీ కలిపి ఒక వెండి నాణెం కొనుగోలు చేశాడు.
ఇలా పైసాపైసా కూడపెడుతూ 25 వెండి నాణేలు కూడబెట్టేసరికి వృధాప్యం వచ్చేసింది.
ఇక తానెంత కాలమో బ్రతకననే విషయం అతనికి తెలిసిపోయింది.
ఇలా కష్టపడి కూడబెట్టిన వెండి నాణేలను ఎలా బధ్రపరచాలా? అనే ఆలోచనలో పడ్డాడు. తన జీవితాంతం కష్టించి సంపాదించిన ఆ నాణేలను ఎవరికీ ధారాదత్తం చేయడం అతనికి ఏ మాత్రం ఇష్టంగా లేదు.
ఆ నాణేలు తన మరణానంతరం ఎవ్వరికీ చెందరాదనుకున్నాడు.
తన చొక్కా జేబుల్లో వుంచుకుని మరణిస్తే ఎవరైనా దొంగిలించే అవకాశం వుందని,
తాను బ్రతికుండగానే ఆ నాణేలన్నింటినీ మ్రింగేసి,
తన శరీరంలోనే ఎవరికీ తెలియకుండా బధ్రపరచాలనుకున్నాడు.
అలా చేయడం వల్ల తన మరణానంతరం కూడా
తన జీవితకాలంలో సంపాదించిన నాణేలు తనతోపాటే వుండిపోతాయనుకున్నాడు.
ఆ ఆలోచన వచ్చిందే తడవుగా, ఆ వెండి నాణేలను ఒకదానిపై ఒకటి వుంచి
వాటన్నింటినీ ఒక్క గుటకలో మింగేశాడు.
**ఆ ప్రయత్నం వికటించింది.**
ఆ నాణేలన్నీ ఒక్కసారిగా మింగుడు పడక,
గొంతులో అడ్డంపడి
ఊపిరాడక ప్రాణాలొదిలేశాడు, ఆ ముసలి బిక్షగాడు!!
ఏమైతేనేమి!
బిక్షగాడు ఆశించినట్లు అతను సంపాదించిన నాణేలు ఏవీ ఎవ్వరికీ చిక్కకుండా,
తన దేహంలోనే వుంచుకుని శరీరాన్ని చాలించాడు.
ఇంతవరకూ బాగానే వుంది.
ఆ అనాధ శవాన్ని స్థానిక మునిసిపాలిటీ వాళ్ళు ఖననం చేసారు.
తూతూమంత్రంగా ఆ అంత్యక్రియలు జరిగాయి.
చనిపోయిన ఆ కళేబరాన్ని అనేక జంతువులు
తమ ఇష్టమొచ్చినట్లు పీక్కుతిన్నాయి.

శరీరంలోని మాంసాన్ని ఆరగించేసాయి.
తల భాగం 'పుర్రెతో పాటు, శరీరంలోని ఎముకలన్నీ చెల్లాచెదరైనాయి.
ఒక రోజున ఆ దారి వెంబడి వెళ్ళే స్కూలు పిల్లల కాలికి
ఎముకల గూడులాగా వున్న ఆ బిక్షగాని పుర్రె వారి కాలికి తగిలి
గలగలా చప్పుడు చేసింది. ఆ చప్పుడు వారినెంతో ఆకర్షించింది.
చాలాసేపు ఆనందంగా ఆ పుర్రెతో ఆడుకుని,
పుర్రెలోపల చేస్తున్న గలగలను బయటకు తీయాలని
పెద్ద బండరాళ్ళతో కొట్టారు.
ఆ గలగల చప్పుడుకు కారణం ఆ వృద్ధుడు చనిపోతూ మింగిన
నాణేలు నోటి భాగంలోనే పళ్ళ బిగువున వుండిపోయాయి.
కడుపులోకి పోలేదు!!
పిల్లలందరూ ఆ పుర్రెను బ్రద్దలు కొట్టారు.
వెండి నాణేలు బయటపడ్డాయి.
**అదండీ సంగతి !!**
**ఆగర్భ శ్రీమంతుడికైనా...**
**దమ్మిడి లేని బిక్షగాడి విషయంలోనైనా**
**తేడా ఏముంటుంది!!**

# తేలు కాటు దివ్యౌషధం

మానవులు తప్పులు చేస్తుంటారు. ఆపై సంస్కారాల వలయంలో చిక్కుకుంటారు.
తప్పులు చేయడం మానవ సహజం. ఇది కదా మనకు తెలిసింది.
తేలు కుడితే సుమారు 24 గంటలు నరక బాధ భరించాల్సిందే.
ఐతే, చేసిన పాపాలు, తప్పులు మాత్రం చాలాభాగం తేలుకాటుతో హరించబడతాయని
బాబా చెప్పారు. **తేలు కుట్టిన బాధలో, ఆ నొప్పిని తట్టుకునేందుకు**
**హృదయాంతరాళ్ళ నుండి భగవంతుడిని ప్రార్థిస్తారు.**
అందుకే చెడు సంస్కారాల నిర్మూలన జరుగుతుందని బాబా పేర్కొన్నారు.
చెడు సంస్కారాల నిర్మూలనకు తేలు కాటు ఓ చక్కని దివ్యౌషధం.
ఐతే, తేలు కాటు యాదృచ్ఛికంగా, అకస్మాత్తుగా జరిగితేనే ఇది సాధ్యం.
సంస్కారాల నిర్మూలనకై తేలు కాటు బారినపడేలా ప్రయత్నించడం వల్ల
ఎలాంటి లాభముండదని బాబా హెచ్చరించారు.
**గ్రోయింగ్ విత్ గాడ్** గ్రంథంలో పే. **92** నుండి సేకరించడమైంది.

***



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

ఆ మర్నాడు అక్టోబరు 20వ తేదీ ఆదివారం. అందరికీ ఆదివారం ఆటవిడుపు లభిస్తుంది.
మన మండలివారికి ప్రభు సన్నిధికి రమ్మని పిలుపు వచ్చింది.
ప్రభువాజ్ఞ అంటూ అందరూ బిరబిరా పరాత్పరుని సన్నిధికి వచ్చారు.
బుద్ధిమంతులైన పిల్లలలాగా నిలబడ్డారు.
ప్రభువు కోపంగా వున్నారో, ప్రసన్నంగా వున్నారో అర్థం కాలేదు వాళ్ళకి.
ప్రభువు వేసిన ప్రశ్నకి మాత్రం ఖంగు తిన్నారు.
రెండు రోజుల్లో ఇది రెండోసారి ఆ ప్రశ్న ప్రభువు వేయడం.
నిన్ననే కదా మనసు విప్పి నిజం చెప్పాము.
మీ దగ్గర దాచటానికి ఏముంది?
సర్వాంతర్యామివి నీకు అన్నీ తెలుసు.
అందుకనే తప్పులు చేస్తే ఒప్పుకోండి అని అడగ్గానే
తడుముకోకుండా మా తప్పులన్నింటినీ పూసగుచ్చినట్లు చెప్పాము.
మళ్ళీ అడుసులో కాలువేయమని లెంపలు వేసుకొన్నాము.
మరి, మళ్ళీ తప్పు చేశారా? అని అడుగుతున్నారేమిటి
బాబావారు మొహమాటం లేకుండా తప్పులు ఒప్పుకోండి
అని నిలదీస్తున్నారేమిటి? అని ఆశ్చర్యపడ్డారు.
ఏం జవాబు చెప్పాలా? అని తలపట్టుకొన్నారు.
ఒకాయనకయితే చిర్రెత్తుకొచ్చింది బాబా ప్రశ్నతో.
నిన్ననేకదా లెంపలు వేసుకొన్నది.
మళ్ళీ ఇంకోసారి నలుగురిలో తల దించుకోవాల్సిన పని ఏం చేశాను నేను?
ఇదేమి చోద్యం అనుకొన్నాడు.
మనసులో మాట పైకి అనేశాడు.
అయ్యో! ఇదేమిటి? వీడికి ఏమయిందీవాళ !!
నోరు పారేసుకొంటున్నాడు అని తలబాదుకొన్నారు.

వాళ్ళు ఊహించినట్లే బాబావారికి కోపం వచ్చింది.
మన మిత్రుడికి అక్షింతలు వేశారు కొంచెం గట్టిగానే.
నువ్వొక మూర్ఖుడివి అన్నారు.
నేను ఏ పని చేసినా అందులో ఓ పరమార్థం వుంటుందని తెలియదా నీకు అన్నారు.
మళ్ళీ ఈవాళ కూడా తప్పులు చేస్తే ఒప్పుకోండి అని ఎందుకు అడిగానో
నీకెలా తెలుస్తుంది దద్దమ్మా అన్నారు.
మన మిత్రుడికి చెమటలు పట్టాయి. నాకేమయిందీవాళ.
బాబావారికి కోపం తెప్పించానని కొట్టుకుపోయాడు.
నిజంగా నేను మూర్ఖుడిని.
లేకపోతే బాబావారెవరో తెలుసుండీ నోరు జారతానా అని తల్లడిల్లిపోయాడు.
కారుణ్యమూర్తి! ఈవేళ నాపై దయచూపుమా! అని ప్రార్థించాడు.
ఇంతకీ ఈ మిత్రుడు ఎవరు? అతని పేరు ఏమిటి? ఇవి శేష ప్రశ్నలు.
చరిత్రకారుడు ఈ భోగట్టా ఎక్కడా ప్రస్తావించ లేదు. ఎందుకనో ఏమో మరి.
అయితే, మన మిత్రుడి దురుసుతనం పేరు చెప్పి బాబావారు చక్కని సందేశం ఇచ్చారని
మాత్రమే మెహెరుని చరిత్ర చెప్తోంది. ఇతగాడు పేరు చెప్పి, మరో మంచి జరిగింది.
అది ఏమిటీ అంటే, గుస్తాద్, విష్ణు, ఛగన్, రావ్‌సాహెబ్, జాల్, సిద్ధు, ఛాన్జీల
విశిష్టత చరిత్రలో నమోదయింది.
ఈ ఏడుగురు అంటే తమకి ఎంత ఇష్టమో బాబావారే స్వయంగా వెల్లడించారు.
సరే, ఇంతకీ బాబావారీవాళ ఏమన్నారు అంటే,
ఇక్కడేమి జరుగుతోందో నీకెలా తెలుస్తుంది అని మన మిత్రుడిని సూటిగా అడిగారు.
పాపం అతగాడు తత్తరపాటున బిత్తర చూపులు చూశాడు.
నాకేమీ తెలియదు ప్రభు, నన్ను క్షమించు అనుకొంటూ ప్రభువుకేసి దీనంగా చూశాడు.
ఇతగాడి గోడు బాబావారు పట్టించు కోలేదు సరికదా ప్రశ్నల వర్షం కురిపించారు.
తమ పరిష్యా పర్యటనలో పరమార్థం వుందన్నారు.
ఇక్కడ దుష్టప్రవృత్తి వ్యసనంగా మారింది. పరిస్థితిని చక్కదిద్దడానికే ఈ దేశం వచ్చాను.
నేను చేయగల్గింది చేస్తున్నాను అని వెల్లడించారు.
పరిష్యాలో దుష్ట ప్రవృత్తి గురించి నీకు తెలుసా అని అడిగారు.
ఈ దేశంలో పరిస్థితిని చక్కదిద్దడానికి నేను చేస్తున్న పని నీకెలా అర్థమవుతుందని
గదమాయించారు. నాపని తీరు నీ బుర్రకెలా ఎక్కుతుందని నిలదీశారు.
తప్పు చేశాను ప్రభూ మళ్ళీ ఇలా ఇంకెప్పుడూ చేయను గాక చేయను అని మన
మిత్రుడు అనుకొంటూంటే, ధర్మోపదేశం చేశారు.
నాపని గురించి కానీ, నా పనితీరు గురించి కానీ తెలుసుకొనే శక్తి నీకు లేదు కాబట్టి,

నేను చెప్పినట్లు చేయి. నోరు విప్పకు.
ఎందుకు? ఏమిటి? దేని కోసం? అని ప్రశ్నించకు ఎప్పుడూ అన్నారు.
ఇంకోమాట శెలవిచ్చారు, అది తమ విశ్వ కార్యక్రమం గురించి.
ప్రతి సంగతీ విడమరచి చెప్పటం కుదరదు.
వెయ్యిసార్లు నిన్ను సిగ్గుపడేలా చేశాను అనుకో.
కించపడకు. సవినయంగా నిలబడు.
ఇలా ఎందుకు చేయమంటాను అంటే నే చేసే ప్రతి పనికీ ఏదో ఒక అంతరార్థం ఉంటుంది. ఆ మర్మం నీకెలా అర్ధమవుతుంది అని అంటూ బాబావారేమన్నారో తెలుసా?
ప్రపంచం దృష్టిలో నిన్ను నేను నగ్నంగా నిలబెట్టాను అనుకో,
నువ్వు ఎంతో అదృష్టవంతుడివి అని అలనాటి సాధకుడికి సాధికారంగా చెప్పారు.
భగవత్ప్రేమకి అర్హులుకమ్మని మండలివారికి మరోసారి హితవు చెప్పారు.
భగవత్ప్రేమ ఎంతో విలువైన సంపద.
అపురూపమైన వరం అది.
ఈ వర ప్రసాదం ఇవ్వడానికి గురువు ఎప్పుడూ సంసిద్ధుడే.
కానీ, నీ పాత్ర ఖాళీగా లేదు. చెత్త వుంది నీ పాత్ర నిండా అన్నారు.
మన మిత్రులకి తమ మాట సరిగ్గా అర్థమయిందో లేదోననుకుని
బాబావారు ఇంకా ఇలా అన్నారు.
నా ప్రేమని ప్రసాదించాలనుకొంటున్నాను.
కానీ మీ మనస్సు ఖాళీగా లేదు.
కామ వాంఛతో నిండిపోయింది.
ఆ వాంఛని వదుల్చుకోవాలి మీరు.
లేకపోతే దివ్య ప్రేమానుభూతిని కల్పించలేను మీకు.
కాబట్టి కామాన్ని జయించండి.
కామ వాంఛని మనస్సులో నించి త్రోలేయండి అని శెలవిచ్చారు.
తమతో పరిష్యా యాత్ర చేస్తున్న గుస్తాద్‌జీ, విష్ణు ప్రభృతుల విశిష్టత పేర్కొన్నారు.
గుస్తాద్‌జీ సప్తమ భూమికకి చెందినవాడు నిజంగా.
భగవదైక్య స్థితిలో వుండాలి అతగాడు.
ఇహ విష్ణుజీ జిజ్ఞాసువు.
అంత: ప్రేరణ అతని సొత్తు.
ముందూ వెనుకా చూడకుండా, ఆలోచించకుండా అడుగులు వేస్తాడు, కోపంతో ఊగి పోతాడు అప్పుడప్పుడు, అది విష్ణు ప్రవృత్తి అని అభివర్ణించారు.
మరి ఛగన్ ఎటువంటి వాడు?

యోగిలా సమాధిలో వున్నట్లు కన్పిస్తాడు కానీ, కోపం వచ్చినా,
ఉద్వేగపడినా మొహం కందగడ్డలా మారుతుంది అని ఛగన్ ప్రత్యేకత చెప్పారు.
రావ్‌సాహెబ్ మన జనరల్ మేనేజర్ అని పేర్కొన్నారు.
ప్రతి ఒక్కరితోనూ కరుకుగానే వుంటాడన్నారు.
బాబావారి తమ్ముడు జాల్ ఎటువంటివాడు?
జాల్ నా ఆస్థాన సంగీత విద్వాంసుడు అన్నారు.
మరి పాట పాడేవారు ఎవరు?
ఈ ఘనుడు మన సిద్ధు అన్నారు.
పాటకి తగ్గట్టుగా తాళం వేయాలి?
ఆ పని ఎవరు చేస్తారు?
ఆ సమర్థత ఛాన్జీ సొత్తు.
గాయకుని స్వరప్రస్థానాలకి తగ్గట్టు మృదంగం వాయిస్తాడు ఛాన్జీ అని
బాబావారు ప్రస్తుతించారతన్ని. మరి ఇహ శ్రోతలు ఎవరు?
ఈ ప్రశ్నకి బాబావారే జవాబిచ్చారు.
బువాసాహెబ్, కరీమ్, మాసాజీ ముగ్గురూ కూడా శ్రోతలు అని పేర్కొన్నారు.
అలా తమ మండలిలోని వ్యక్తుల ప్రత్యేకతని బాబావారు స్వయంగా వెల్లడించారా
ఆ ఆదివారంనాడు. ఇస్‌ఫహాన్‌లో బాబావారు ఎక్కువగా ఆఘా ఆలీతోనూ,
ఆలీ అక్బరుతోనూ గడుపుతున్నారు. మరి అబ్దుల్లా సంగతి ఏమిటి? అన్న ధర్మ సందేహం
రావచ్చు పాఠకులకి. ఆ ఇద్దరి తోటివాడే అబ్దుల్లా.
అందువల్ల, అతగాడు కూడా బాబావారి దగ్గరే ఎక్కువగా వుంటున్నాడు.
ఇంకో మాటలో చెప్పాలంటే, ఈ అభినవ ప్రహ్లాదుడు తమ ఆరాధ్య దైవాన్ని వదిలి
క్షణమయినా వుండటం లేదు అంటే అతిశయోక్తి కాదు.
నాలుగు నెలలపాటు ఏకాంతవాసం చేయాలన్నది బాబావారి సంకల్పం.
కానీ ఇస్‌ఫహాన్ ఏకాంతవాసానికి అనువైన చోటు కాదుట.
మరెక్కడికయినా వెడదామన్నారు.
ఈ విషయం అక్టోబరు 20వ తేదీన ప్రస్తావనకు వచ్చింది.
కాసేపు తర్జన భర్జన జరిగింది. **యెజ్ద్** బాగుంటుందన్నారు ఒకరు.
ఆ నగర ప్రత్యేకతలు, అక్కడి వెసులుబాటులు చర్చించారు కాసేపు.
సరే ఆ వూరు వెడదామన్నారు.
ఏకాంతవాస కాలంలో తమతో వుండదలుచుకొన్నవాళ్ళు వుండవచ్చు.
మిగిలినవాళ్ళు ఇండియాకి వాపసు వెళ్ళవచ్చు అన్నారు.
ఒక్క మారుతీ పటేల్ తప్ప అందరూ బాబావారితోటే వుంటామన్నారు.

చుక్క పడకపోతే యెజ్ద్‌లో బ్రతకలేరన్న భయం వదిలినట్లు లేదు
మన మారుతి గారికి. ఆ మాట పైకి అనలేదు కానీ, నన్ను వెనక్కి పంపేయండి బాబా,
ఈ పరిష్యాలో ఇహ వుండలేను అన్నాడు. సరే నీ ఇష్టం అన్నారు బాబా.
ఇండియాకి పంపిస్తానులే నిన్ను అని భరోసా ఇచ్చారు.
యెజ్ద్ చేరాక, అక్కడి నుండి ఇంటికి పంపుతాను అన్నారు చిరునవ్వుతో.
పాపం మనవాడు కిక్కురుమనలేదు.
ప్రభువు సరదా పట్టిస్తున్నారు మనవాడిని అని మండలివారు ముసిముసినవ్వులు
నవ్వుకున్నారు. మారుతిని చూస్తే నవ్వు వస్తోందా మీకు అనుకొన్నట్లుంది.
బాబావారు ఓ చురక వేశారు.
ఇహ మీదట ఏమవుతుందో ఎవరికీ తెలియదు అని హెచ్చరించారు.
నావెంట వుండాలనుకొన్నా, వెనక్కి వెళ్ళిపోవాలనుకున్నా తొందరపడకండి.
ఒకటికి రెండుసార్లు ఆలోచించి మరీ నిర్ణయం తీసుకోండి అన్నారు.
ఇప్పటి వరకు పడ్డ కష్టాలు, బాధలు మీకు తెలుసు కదా.
ముమ్ముందు ఏమవుతుందో. జలుబు చేయవచ్చు.
జ్వరం రావచ్చు. కష్టాల సుడిగుండంలో చిక్కుకోవచ్చు.
కాబట్టి ఇంతవరకూ ఎదురయిన చేదు అనుభవాల దృష్ట్యా మున్ముందు ఎలా వుంటుందో
ఊహించండి. ఏం చేయాలనుకుంటే,
అంటే, తమ వెంట పరిష్యా యాత్ర కొనసాగించడమో,
వెనక్కి ఇంటికి వెళ్ళిపోవడమో మీ ఇష్టం. మీరే నిర్ణయించుకోండి అన్నారు.
అంతేకాదు మరో బాంబు పేల్చారు.
నన్ను నమ్మండి అన్నారు.
మంచు కురుస్తున్నా, బయట గడ్డ కట్టుకుపోతున్నా సరే,
కదలండి ముందుకు అంటే మీరు కదలాలి.
నా వెంట రావాల్సి వుంటుంది అని స్పష్టం చేశారు.
ఈ చలిగిలి తమకి అంటవన్నారు. అయితే మీకు అలా కాదు కదా!
ఆటు పోటు తట్టుకోవడం నేర్చుకోవాలి మీరు.
కాబట్టి మీరు ఏం చేయాలో జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి అన్నారు.
ఇండియాకి వాపసు వెళ్ళాలనుకొంటే, అలానే చేయండి.
నాతో వుండాలనుకోంటారే అదీ మంచిదే అన్నారు.
తమతో పరిష్యాలో వుండటమే ఉత్తమం అని స్పష్టం చేశారు.
అయితే తమతో యాత్ర కష్టాలు కోరి తెచ్చుకోవడమేనని తేల్చిచెప్పారు.
తమతో వుంటే మీరు చనిపోయిన వ్యక్తుల క్రింద లెక్క. ఎందుకంటే మీ ఇచ్ఛ ప్రకారం

ఏమీ చేయలేరు మీరు. ప్రతి క్షణం నా ఇచ్ఛ ప్రకారం నడుచుకోవాలి.
అలా నా అభీష్టం ప్రకారం నడుచుకొంటే, మీ వెంట్రుక తాకలేరు ఎవ్వరూ!
అని అభయం పలికారు.
బాబావారు ఎంత స్పష్టంగా, విస్పష్టంగా చెప్పినా,
ఇంకా కొంతమంది వుండాలా, వెళ్ళిపోవాలా అన్న సందిగ్ధంలో పడ్డారు.
మీ కోసం అంటూ పర్షియన్ సుభాషితాలు చెప్పారు బాబావారు.
– ఆలోచన వచ్చిందా నిజమైన భగవత్ప్రేమికుడిగా మారాలని
అయితే ఇచ్చేయి తిలోదకాలు జీవితానికి. కడిగేసుకో చేతులు.
– గురువు ముంగిట గడప దాటాలా, అయితే
ముందు బంధవిముక్తుడివి కావాలి.
మూర్తీభవించాలి నిజాయితీ
– ప్రేమికుని మెడ విరచడం ఈ దర్బారు పద్ధతి.
నిర్లక్ష్యమే చక్రవర్తి ప్రవృత్తి.
– సందేహాలను తుడిచివేయి
మనస్సు నుండా ప్రేమతో నింపడానికి తహతహలాడు.
– పరుగెత్తలేవు చాలా గుర్రాలు
ఈ పందెంలో కనబడవీ దారిలో ఎన్నో నెమళ్ళు
ఈ పరుగు పందెం కొన్ని గుర్రాలకే, ఈ దారి నెమళ్ళు కొన్నింటికే.
– ప్రేమికుని హృదయం ఆవాసం సింహరాజుకి
ఈ దారిలో అడుగు పెట్టేవారు విరక్తి మూర్తీభవించినవారే.
– తప్పు సుమా! ప్రేమ విరహ వేదనల ప్రస్తావన అవమానకరం సుమీ!
ఫిర్యాదు చేయడం ప్రేమ, సేవల గురించి.
– సొంతమయితే ప్రేమ కిరణాలు పొందినట్లే ప్రాపంచిక సంపదలన్నీ.
– ప్రియతముని దర్శించిన ప్రేమికునికి జీవిత మాధుర్యం ప్రేమే
అనంత అస్తిత్వం జీవితమే – ఈ సుభాషితాలు చెప్పాక బాబావారు అడిగారు,
“ఇప్పుడు చెప్పండి! నాతో ఎవరు వుంటారో?
మేము అందరం మీతో వుంటాము బాబా అన్నారు అందరూ ముక్తకంఠంతో.
బాబావారు చిరు దరహాసం చేశారు. ముున్ముందు ఏమవుతుందో చూద్దాం అన్నారు.
రుస్తుం, రమ్జు, దస్తూర్‌లని పిలిపించాలనుకొంటున్నానన్నారు.
బాల గోపిక వసంత్‌కి కూడా కబురు పెట్టాలని వుందన్నారు.
యెజ్దీకి వెళ్ళాక కబురు పంపుతామన్నారు.

–సశేషం

# మార్గెట్ క్రాస్కీ



మార్గెట్ క్రాస్కీ ఇంగ్లాండు దేశీయురాలు. గొప్ప డాన్సర్. పాశ్యాత్య నృత్యరీతుల మీద రెండు ప్రామాణిక గ్రంథాలు ఆమె రాసింది. ఆమె లండన్‌లో అలాగే కొంతకాలం అమెరికాలో నృత్య పాఠశాలను నెలకొల్పి ఎందరికో నృత్యంలో శిక్షణ ఇచ్చింది. ఆమె శిష్యులు నేడెందరో పేరెన్నికగన్న నృత్యకళాకారులుగా అమెరికా, లండన్‌లలో వున్నారు. ఆమె శిష్యులు చాలామంది మెహెర్‌బాబా పరిధిలోకి వచ్చారు. మెహెర్‌బాబా ఈమెను **BABA's DANCER** అని ప్రస్తుతించారు. మార్గెట్ క్రాస్కీ ఇంగ్లాడులో నార్‌ఫోక్ అనే ప్రాంతంలో 1892 నవంబరు 26న జన్మించింది. మార్గెట్‌కు తన ఎడల గల ప్రేమ వల్లనే తాను ఇంగ్లాండుకు వచ్చానని మెహెర్‌బాబా ప్రకటించారు.

మెహెర్‌బాబా తన పాశ్చాత్య పర్యటనలో భాగంగా 1931 సెప్టెంబరు 12న తొలిసారిగా లండన్ వెళ్ళారు. అక్కడ బాబా ప్రేమికురాలు కిట్టీదేవి తల్లితండ్రుల ఇంట్లో బాబాకు బస ఏర్పాటు చేశారు. ఆనాడు ప్రప్రథమంగా బాబాను సాదరంగా స్వాగతం పలికి ఆహ్వానించింది – మార్గెట్ క్రాస్కీనే.

మెహెర్‌బాబాను తొలిసారిగా దర్శించుకున్నప్పుడు బాబావారి ప్రేమతో తన మనస్సు నిండిపోయినట్లైందని, తన జ్ఞాపకాలను గుర్తుచేసుకుందామె.

బాబావారి పిలుపు మేరకు 1941 ప్రాంతంలో ఆమె లండన్‌లో నడుపుతున్న డాన్స్ స్కూలును మూసివేసి, నాసిక్‌లో మెహెర్‌బాబా ఆశ్రమంలో సుమారు 7 సంవత్సరాలు బాబా సమక్షంలో వుంది. అనంతరం ఆమెను అమెరికా తిరిగివెళ్ళి, తన నామవ్యాప్తికి కృషిచేయమని బాబా ఆదేశించారు.

బాబా ఆదేశాల మేరకు ఆమె 1947లో అమెరికా వెళ్ళి, డాన్స్ స్కూలు నెలకొల్పి, ఎందరికో డాన్స్‌లో శిక్షణ ఇచ్చింది. 1981 తర్వాత డాన్స్ స్కూలు నుండి తప్పుకుని మెర్టిల్ బీచ్ వెళ్ళి అక్కడున్న బాబా కేంద్రంలో తన సేవలందించింది.

మార్గెట్ క్రాస్కీ తన వ్యక్తిగతాన్ని చెబుతూ 1929 – 1931 మధ్యకాలంలో తనవాళ్ళు అనుకున్నవాళ్ళందరూ తెరమరుగయ్యారని చెప్పింది.

ఆ సమయంలో, ముందుగా నా తండ్రి మరణించాడు.
ఆ వెనువెంటనే నా తల్లి, ఆ తర్వాత నేను అమితంగా ప్రేమించి పెళ్ళాడిన భర్త,
ఇలా వరుసగా ఒకరి తర్వాత ఒకరు, ఏదో శాపం మాదిరి, ఈ లోకం వదిలి వెళ్ళిపోయారు.
ఆ సమయంలో నా మానసిక పరిస్థితి మాటల్లో చెప్పలేను.
ఆ దిక్కుతోచని స్థితిలో నేను భగవంతుని వైపు చూస్తూ కూర్చున్నాను.
అంతకుమించి నేనేమీ చేయలేని స్థితిలో వున్నాను.
ఒక అమాయకురాలిగా, దాదాపుగా నేనొక పిచ్చిదాన్నయ్యాను.
ఆ సమయంలో నాకు తెల్సిన వాళ్ళనెవ్వరినీ చూడదల్చుకోలేదు.
ఎవరినీ ఏ సహాయం అడగాలనిపించలేదు.
ఎక్కడికయినా దూరంగా వెళ్ళి, ఈ పరిస్థితి నుండి
బయటపడాలని నిర్ణయించుకున్నాను.
ఏదో ఒకటి చేసి జీవిద్దామని దక్షిణ ఇంగ్లాండు వైపు బయల్దేరాను.
దార్లో ఒక అపరిచితురాలు ఎదురైంది. ఆమె నన్ను ఎక్కడికి వెళ్తున్నావని అడిగింది.
ఫలానా ప్రదేశం అని చెప్పాను.
ఓ! అదా...అది చాలా బాగుంటుంది. ఆ ప్రదేశం గురించి మాటల్లో వర్ణించలేం!!
తన పైళ్ళెన కొత్తల్లో హనీమూన్‌కి వారు అక్కడికే వెళ్ళామని చెప్పింది.
ఆమెకు తిరిగి అక్కడికి వెళ్ళాలని వుంది, కానీ తగినంత డబ్బులేక వెళ్ళలేకపోతున్నానంది.
తక్షణం నేనే ఆమెకు కూడా రైలు టిక్కెట్‌కొని ఆమెను నాతోపాటు అక్కడికి తీసువెళ్ళాను.
అలా వెళ్తూ-వెళ్తూ- మాటల్లో - ఆ మాటా - ఈ మాటల దొంతర్లలో
ఈ ఏడాది క్రిస్‌మస్ పండక్కి స్నేహితులందరికీ దూరంగా
ఎక్కడికయినా వెళ్ళాలని వుందన్నాను. ఆ మాట వింటూనే
ఆమె నాకొక సలహా ఇచ్చింది. అది మరో చక్కని ప్రదేశం అని చెప్పింది.
దాన్ని మెరిడిత్ స్టార్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడని చెప్పింది.
అయితే అది ఆధ్యాత్మిక కేంద్రం అని ఆమె చెప్పలేదు.
ఆమె గనుక ఆధ్మాత్మిక ప్రదేశం అని చెప్పివుంటే నేను వెళ్ళేదాన్ని కాదేమో!!
అక్కడ రోజుకి నాలుగు గంటలు ధ్యానం చేయిస్తారని మాత్రం చెప్పింది.
ఆ మాట ప్రకారం, నేను మెరిడిత్ స్టార్‌కి ఉత్తరం రాశాను.
క్రిస్మస్ సెలవలకు తను అక్కడకు రావాలని వుందని, తనకు తగిన బస,
ఇతర వసతి ఏర్పాట్లు కోరుతూ వివరంగా ఉత్తరం రాశాను.
మెరిడిత్ నా కోరిక ప్రకారం తగిన ఏర్పాట్లు చేసినట్లు జవాబిచ్చాడు.
ఆ మేరకు 1931 క్రిస్మస్ వేడుకలకు నేను అక్కడికి వెళ్ళాను.
చిన్న కొండమీద రాళ్ళతో నిర్మించిన భవనం అది. అక్కడికి చేరుకోవాలంటే

రెండు మైళ్ళు నడవాలి. రోడ్డు బాగుండదు.
పైపెచ్చు రోడ్డు ఎగుడు దిగుడుగా వుంది.
నడుస్తుంటే దుమ్ము లేస్తుంది. రోడ్డు కూడా పరిశుభ్రంగా లేదు.
రోడ్డు ప్రక్కల ముళ్ళపొదలు – పిచ్చి మొక్కలతో నిండి వుంది.
అలాంటి రోడ్డుపై నడుచుకుంటూ మెరిడిత్ స్టార్ నిర్వహిస్తున్న ఆశ్రమానికి
చేరుకున్నాను. ఆశ్రమంలో లోపలి గదిలోకి అడుగిడగానే హాలులో కుడివైపున
మెహెర్‌బాబా ఫోటో కనిపించింది. ఆ ఫోటో ఎవరిదని మెరిడిత్‌ని అడిగాను.
మెహెర్‌బాబా గురించి మెరిడిత్ క్లుప్తంగా చెప్పాడు.
అలా మొదటిసారిగా మెహెర్‌బాబా గురించి తెలుసుకున్నాను.
నేనక్కడ రెండు వారాలుండాలని వెళ్ళాను.
నేను ఆ ఆశ్రమం వదిలి తిరిగి వెళ్ళే రోజు దగ్గర పడింది.
ప్రతిరోజూ ఈ మాదిరి ధ్యానం చేస్తూ నీవు నిష్ఠగా వుంటే,
రాబోయే ఐదు సంవత్సరాలలో నీకు మెహెర్‌బాబా దర్శనం తప్పక లభిస్తుందని
మెరిడిత్ అన్నాడు. ఐతే, అనుకోకుండా, నా అదృష్టం కొద్దీ – ఐదేళ్ళు కాదు –
ఐదు నెలల్లోనే బాబా **డోవెన్‌షైర్‌కి** తన ఇంగ్లాండు పర్యటనలో భాగంగా వచ్చారు.
అలా మెహెర్‌బాబాను దర్శించుకున్నాను.
బాబా అక్కడకు వచ్చిన రోజున, కాలింగ్ బెల్ మ్రోగితే నేనే వెళ్ళి తలుపు తీశాను.
ఎన్నడూ ఊహించని ఒక అద్భుతమైన వ్యక్తి నా ఎదుట కనిపించారు.
ఆయనలో ఎలాంటి అతీంద్రియ శక్తి నాకు కనపడలేదు.
ఎంతో నిరాడంబరంగా, సున్నితంగా, దైవీ ప్రేమ ఉట్టిపడుతూ వున్నారు.
నా హృదయ తంతువులు మీటినట్లైంది.
మెహెర్‌బాబాతోపాటు మెరిడిత్ స్టార్, బాబా మండలి ప్రేమికులు ఛాంజీ,
తదితరులు వున్నారు. బాబా నాకేసి క్రీగంట చూసి,
తన మండలివారితో తనకి కేటాయించిన గదిలోకి వెళ్ళారు.
నేను అచేతనంగా ఆలా చూస్తూ నిల్చుండి పోయాను.
నాకు ఏం చేయాలో పాలుపోలేదు ఆ క్షణంలో.
నిశ్చేష్టురాలినై, నిశ్శబ్దంగా చాలాసేపు నిల్చున్నాను.
కొన్ని నిముషాల తర్వాత – మెరిడిత్ నవ్వుతూ, సంతోషంగా బయటకు వచ్చి
మెహెర్‌బాబా నిన్ను పిలుస్తున్నారని చెప్పాడు.
ఆ మాటలతో కొద్దిగా తడబడ్డాను. తిరిగి ఈ లోకంలోకి వచ్చినట్లై – ముందుగా –
నన్ను కాకుండా మరెవ్వరినైనా పిలిస్తే బాగుంటుంది కదా అన్నాను.
మెరిడిత్ కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత నాకేసి కోపంగా చూస్తూ...

మెహెర్‌బాబా నిన్ను పిలుస్తున్నారని మాత్రం అన్నాడు. దాంతో...
అటు – ఇటు వున్నవాళ్ళకేసి చూసి, ధైర్యం కూడదీసుకుని – బాబావారున్న గదికేసి
అడుగులేశాను. ఆ గదిలో బాబా ఒక కుర్చీలో కూర్చుని వున్నారు.
తనకెదురుగా నా కోసం మరో కుర్చీని వేయించమని
బాబా కార్యదర్శి ఛాంజీతో అన్నారు. కుర్చీ ఏర్పాటు చేశాక,
నన్ను ఎదురుగా కూర్చోమని బాబా సంజ్ఞలతో చెప్పారు.
అక్కడ అంతా నిశ్శబ్దంగా వుంది.
ఆయన్ని ఏమని సంభోదించాలో కూడా బోధపడలేదు.
బాబానే అక్షర ఫలకంపై **...**
**it was Margaret's love that brought him to England** అన్నారు.
(నా ఎడల నీకు గల ప్రేమవలనే, నేను ఇంగ్లాండుకు వచ్చానన్నారు బాబా).
బాబావారి కళ్ళలోకి నేరుగా చూడాలనిపించింది.
ధైర్యం చేశాను. బాబావారి కళ్ళలోకి సూటిగా – నేరుగా –తీక్షణంగా
నా శక్తినంతా కూడగట్టి ఆయన్ని చూసే ప్రయత్నం చేశాను.
ఆ సమయంలో నేను అవతారునిలో ఏం దర్శించుకున్నానో నేనిప్పుడు మాటల్లో చెప్పలేను.
నిజానికి ఆ అనుభూతి వర్ణించలేను. ఆ క్షణాలు అనిర్వచనీయమైనవి.
నాకు తెలిసింది ఒక్కటే – ఆయన ప్రేమ నిండిన దైవీ మానవుడని
ప్రేమావతారుడని, ఆ క్షణాన నా మనస్సులో గాఢంగా ముద్రబడింది.
ఆ తర్వాత్తర్వాత బాబా ఎన్ని కష్టాలు ఇచ్చినా,
మరెన్ని బాధలు అనుభవించవల్సి వచ్చినా –
ఆ క్షణంలో నా మనస్సులో పడిన ఆ ముద్ర చెరిగిపోలేదు.
ఆయన దివ్యావతారంలో తిరిగి నాకెలాంటి అనుమానం రాలేదు.
నేను అక్కడ నాల్గు రోజులు బాబా సమక్షంలో ఆయన శిష్యులందరితో కల్సివున్నాను.
94 సంవత్సరాల వరకూ న్యూయార్క్‌లో డాన్స్ క్లాసులు చెబుతూ,
ఆ తర్వాత మెర్టిల్ బీచ్‌లో స్థిరపడి, అక్కడికి వచ్చిన బాబా ప్రేమికులకు
బాబాతో తన అనుభవాలు చెబుతూ, ఉత్సాహంగా, సంతోషంగా కాలం గడిపిన
మార్గెట్ 97 సంవత్సరాల నిండు వయస్సులో, 1990 ఫిబ్రవరి 18న
బాబాలో ఐక్యమయింది.
ఆమె అస్థికలను మెహెర్‌బాద్‌లో బాబా సమాధికి దగ్గరలో ఉంచారు.
ఆమె సమాధిపై **బాబాస్ డాన్సర్** అని రాసివుంటుంది.
ఈ దఫా మెహెరాబాద్ వెళ్ళినప్పుడు సందర్శించండి!!

❃❃❃



# చాచా మస్తు

ఏడవ భూమికకు చెందిన చాచా గొప్ప మజ్జూబ్ అని బాబా చెప్పారు. మాసిన గడ్డం, చిక్కి శిధిలమైన శరీరంతో కనిపిస్తాడు చాచా. బాబా మండలి సభ్యుడైన బైదుల్ చాచా గురించి ఆజ్మీర్ పట్టణంలో అనేకమందితో అడిగి సేకరించిన విషయాలివి క్లుప్తంగా. చాచా మస్తు – అతనొక పఠాను. అసలు పేరు సూర్ ఆలీషా. చాలా సంవత్సరాలు పెషావర్‌లో ఉన్నారు. చాచా ఒక హాఫిజ్. అంటే ఖురాన్‌ను కంఠస్తము చేసిన వాడని అర్థము. అతను అజ్మీరులో అరబ్బీ భాష నేర్వడానికని వచ్చాడు. కాగా, ఇక్కడ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీవారి దర్గా చూశాక అక్కడే వుండిపోవాలని కోరిక కలిగింది. దాంతో దర్గాలోని స్మశాన భూమి దగ్గర నివాసం వున్నాడు. ఏమైందో తెలీదుగాని అతను క్రమేణా ఒక 'మజ్జూబ్' అయిపోయాడు. పన్నెండు సంవత్సరాల తర్వాత దర్గాలోంచి బయటకు వచ్చి మరోచోట ఆరు సంవత్సరాలు ఉన్నాడు. తర్వాత ఒక సంవత్సరంపాటు తారాఘడ్ కోటలో ఉన్నాడు. తారాఘడ్ నుండి అక్కడకు దక్షిణంగా 300 మైళ్ళ దూరంలో వున్న ఇందోర్ పట్టణానికి వెళ్ళాడనీ, అతను అక్కడే చనిపోతే పాతిపెట్టారని చెబుతారు. ఇందోర్‌లో అతనిని గంజాబాబా అని పిలిచేశారు. గంజా అంటే బోడిగుండువాడని అర్థం. అతడు చనిపోయాడన్న ఒక సంవత్సరం తర్వాత ఇందోర్ నుండి కొందరు అజ్మీర్‌లో జరిగే ఖ్వాజా సాహబ్ దర్గా వార్షికోత్సవానికి వచ్చారు. అక్కడివాళ్ళు ఒక నీటికుళాయి దగ్గర గంజాబాబా (చాచా) ను చూసి ఆశ్చర్యపడ్డారు. ఇందోర్‌లో అతను చనిపోయినప్పుడు పాతిపెట్టగా చూసినవారు ఇతనిని గుర్తుపట్టారు. ఈ వింతవార్త ఆనోటా ఈనోటా అక్కడ ప్రాకింది. మెల్లమెల్లగా చాచా పేరు ప్రసిద్ధికెక్కింది. ఇది నిజమా, కల్పితమా ఎవరికి వారే నిర్ణయించుకోవాలి.

1939 ఫిబ్రవరిలో మెహెర్‌బాబా మొదటిసారి చాచాను కలుసుకున్నారు. 1938 డిసెంబరులో బాబా తన ప్రాచ్య, పాశ్చాత్య శిష్యులతో బస్సులో యాత్ర ప్రారంభించారు. మొదటవారు దక్కన్‌లోని హైదరాబాద్ (ఇప్పుడు తెలంగాణాకు) వెళ్ళారు. అక్కడ నుండి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూరు మీదుగా కాశీ, ఆగ్రా, మధురా, ఢిల్లీ వెళ్ళారు. అక్కడ నుండి వారు రాజస్థాన్ ఇసుక ఎడారులు, ఆరావళీ పర్వతాలు దాటి ప్రఖ్యాత ముస్లిమ్ సద్గురువు ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టీవారి దర్గావున్న అజ్మీరు చేరుకున్నారు. మెహెర్‌బాబా అక్కడ ఒక మస్తు ఆశ్రమాన్ని ప్రారంభించారు.

ఆ రోజుల్లో చాచా, ఖ్వాజా సమాధి దగ్గర ఒక అపరిశుభ్రముగా, మురికితోనూ, పురుగులు పట్టివున్న చిన్న గుడిసెలో ఉండేవాడు. అతను గుడిసెలోంచి ఎప్పుడూ బయటకు వచ్చినట్లు ఎవ్వరూ చూడలేదు. ఒక సేవకుడు అతనికి కావలసినవన్నీ సమకూర్చేవాడు. చాచా ఎప్పుడూ పాచిపోయిన ఆహారం, ఒలికిపోయిన టీ మరకలతో నిండిన మురికిబట్టలతో దుర్వాసన కొట్టుకొంటూ ఉండేవాడు. అతనికి చాయ్ (టీ) అంటే చాలా ఇష్టం. టీ కావలసినప్పుడు 'చా' 'చా' అని అరచేవాడు.

అందరూ అతనికి **చాచా** అని పిలువసాగారు. తెచ్చిన టీలో చాలాభాగం త్రాగకుండా బట్టలమీద ఒలక బోసుకునేవాడు. అంతేకాదు, అతని నెత్తిమీద టోపీ కూడా టీతో తడిసేది. అలా టీ తోను, పంచదారతోను తడిసిన ఆ టోపీ బంకలా అతని తలకు అతుక్కుపోయి తీయడానికి వీలుకాకుండా ఉండేది.

బాబా చాచాను తన దగ్గరికి తీసుకురావడానికి కాకాను పంపించారు.

చాచా రాగానే బాబా అతనికి స్నానం చేయించడానికి అతని బట్టలు, టోపీ తీయడానికి ప్రయత్నించారు. ఐతే, అతని దుస్తులు టీ, అన్నము, ఇతర పదార్థములతో పేరుకుపోయి గట్టిపడి ఒంటికి అతుక్కుపోయి వున్నాయి. దాంతో వాటిని నెమ్మదిగా కత్తిరించి తీయల్సివచ్చింది. ఈ రోజున మొదటిసారి స్నానం చేశాక చాచా గత ముప్ఫై సంవత్సరాలలోనూ పొందనటువంటి అద్వితీయమైన అనుభవం పొందాడు.

అదే అతని ఆఖరి స్నానం కూడా. స్నానం చేశాక బాబా ఒక కొత్త కఫ్నీ తొడిగించారు. తరువాత ఒక ప్రత్యేకమైన కూరతో జొన్నరొట్టె కావాలన్నాడు. బాబా స్వయంగా అవి తినిపించారు. భోజనమైన వెంటనే చాచా ఒక టాంగా తెప్పించమన్నాడు.

బండి రాగానే చాచా అందులో ఎక్కి కూర్చొని బాబాను తన ప్రక్కన కూర్చోమన్నాడు. తారాఘడ్ పొమ్మని టాంగావానికి చెప్పాడు. అయితే అంతదూరం చాచాతో ఆ పాత కోటకు వెళ్ళడం ఇష్టంలేక బాబా అతనిగదిలోనే విడిచిపెట్టారు. ఇలా మొదటిసారి కలుసుకొన్న తరువాత బాబా రెండు వారాలపాటు ప్రతిరోజు ఉదయం చీకటిలో 3.30 గంటలకే లేచి ఇరుకు వీధులలో వున్న అతని గదికి నడచివెళ్ళి అక్కడ ఒక గంటసేపు ఏకాంతంగా గడిపేవారు. పగటిపూట వీధులలో ప్రజలను దాటుకుంటూ చాచా గుడిసెకు వెళ్ళడానికి ఇష్టంలేక బాబా ఇలా చేసేవారు. ఈ విధంగా 1939 ఫిబ్రవరిలో మొదటిసారి చాచాను కలిసినప్పటి నుండి 1947లో చాచా సతారాకు వచ్చేవరకు బాబా అనేకసార్లు అతనిని ఏకాంతంగా కలిసారు. ఈ మస్తు నివసించే దుర్గంధ పూరితమైన గుడిసెను బాబా ఎందుకు శుభ్రం చేయించలేదనే సందేహం కొందరు విమర్శనాపరులైన పాఠకులకు కలగవచ్చు. బాబా అనేకసార్లు చాచా గదిని మండలివారి చేత శుభ్రం చేయించడానికి ప్రయత్నించారు. అయితే చాచా వారిని అడ్డుకునేవాడు. అదే విధంగా చాచా 1947లో సతారాలో వున్నప్పుడు కూడా మురికి దుస్తులను తీయడానికి నిరాకరించాడు.

మస్తుల దగ్గర చిరకాలం నుండి వున్న బట్టలూ, ఇతర చిల్లర సామానులు కొంత ప్రత్యేక అంతరంగిక విశిష్ఠత కలిగి ఉంటాయన్నారు బాబా. అందుచేతనే మస్తులు వాటికి అంటిపెట్టుకొని ఉంటారు. 1942 జూలైలో బాబా చాచాను కలుసుకోవడానికి అజ్మీరు వెళ్ళారు. చాచా అడిగినప్పుడల్లా అతనికి టీ ఇవ్వడానికి తగిన ఏర్పాటు చేశారు. రాత్రి బాగా ప్రొద్దుపోయిన తరువాత చాచా గదికి వెళ్ళారు. నూరు కప్పుల టీ పట్టే కుళాయిగల పీపాలో టీ పోయించి కణకణామండే బొగ్గులున్న కుంపటిమీద పెట్టి ఆ గదిలో ఉంచారు. చాచా టీ అడిగినప్పుడల్లా బయటకు పోనవసరం లేకుండా టీ అందిస్తుంటే తన పనికి అనుకూలంగా ఉంటాడని బాబా ఉద్దేశము.

సాధారణంగా ప్రతి పది నిమిషాలకొకసారి చాచా టీ అడిగేవాడు. ఈసారి మాత్రము బాబా అక్కడ ఉన్న రెండు గంటల్లో రెండు మూడుసార్లు మాత్రమే చాచా టీ అడిగాడు. బాబా మౌనంగా తన పని ముగించుకొని మిగతా టీ అప్పటికింకా దర్గా దగ్గరకు వస్తున్న యాత్రికులకు ఉచితంగా ఇవ్వమని చెప్పారు.

బాబా మరోసారి అజ్మీరు వెళ్ళినప్పుడు ఇంకో గంటకు తెల్లవారుతుందనగా చాచా గదికి వెళ్ళారు. ఈ గదికి పైన మరొక చిన్న గదిలో చాచా సేవకుడు ఉండేవాడు. అతను చాచాకి కావలసిన ఆహారము మొదలైనవి తెచ్చి ఇచ్చేవాడు. చాచా దగ్గరకు వచ్చేవాళ్ళు ఆ సేవకుని చేతిలో కొంతసొమ్ము ఇస్తుండేవారు. బాబా కూడా వెళ్ళినప్పుడల్లా అతనికి ఐదు రూపాయిలు ఇచ్చి సంతోషపెట్టేవారు. ఈసారి ఆ సేవకుడు గాఢనిద్రలో ఉన్నాడు. బాబా మనుషుల మాటలువిని, బాబా తనకు ఇచ్చే బహుమతిని తలచుకుని కంగారుగా లేవబోయి తలుపు మెట్ల మీద నుంచి వీధిలోకి దొర్లిపడ్డాడు. అయితే అతనికేమీ అపాయం కలగలేదు. అతనికి ఐదు రూపాయిలు ముట్టాయి. 1946 జూలైలో బాబా మళ్ళీ అజ్మీరు వచ్చారు. అప్పుడు చాచా ఎంత ఆనందించాడో కాకా చెప్పాడు. బాబా ఒక చేతిలో కప్పు, సాసరు, మరొక చేతిలో వేడి టీ వున్న కెటిల్ పట్టుకొని చాచా గదిలోకి వచ్చారు. చాచా టీ వద్దన్నాడు. తనకు మాంసము, చపాతీలు కావాలన్నాడు. చాచా పఠాను తెగవాడు. పఠానులు మంసం ఎక్కువగా తింటారు. బాబా అవి తెప్పించి పెట్టారు. ఇంకా ఇంకా కావాలని మూడుసార్లు అడిగి తెప్పించుకున్నాడు. చాచా దగ్గర బాబా ఒక గంటన్నర సేపు ఉన్నారు. అంతసేపూ చాచా నవ్వు వినిపిస్తూనే వుంది. మజ్జూబ్ అయిన చాచా చాలా మొండివాడు. ప్రతిదానికి హఠం చేసేవాడు. ప్రపంచంతోగాని, వివిధ రకాల శ్రమ జీవులతోగాని అతని కెటువంటి సంబంధం ఉండేదికాదు. అతను ఎవరినీ పట్టించునేవాడు కాదు. మజ్జూబ్‌లు మనుషుల ఎడల ఒక రకమైన తిరస్కార భావము లేదా పసిబాలునివలె ఉపేక్షాభావముతోఉంటారు. బాబావంటి వారు కనబరచే మహత్తరమైన ఆధ్యాత్మిక



శక్తికి మాత్రమే వారు వశులై బాబా మండలివారి మాటలు వినేవారు. 1947 మే నెలాఖరులో బాబా మండలి వారితో సహా మహాబళేశ్వరం నుంచి సతారా వచ్చారు. సతారాలో మస్తు ఆశ్రమం ప్రారంభించడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. చాచాను తీసుకురావడానికి బైదుల్‌ని అజ్మీరు పంపించారు. మే నెలలో భారతదేశమంతా వేసవి వేడికి భూమి ఎండిపోయి, ఎవరికీ ఏ పనీ చేయడానికి వీలుపడదు. భూమి ఆర్చుకుపోయి నీటి కోసం తపిస్తుంది. ఇలాంటి ఎండవేడిలో, నిస్సారమైన ఎడారి ప్రకృతి దృశ్యాలను చూస్తూ బైదుల్ మే నెలాఖరుకి అజ్మీరు చేరుకున్నాడు. చాచా ఉండే గుడిసె దగ్గరకురాగానే అతని మనసులో సంశయమూ, ఆశ ఒక్కసారిగా కలిగాయి. ఆ సమయంలో అజ్మీరులో ఖ్వాజా సాహెబ్ వార్షికోత్సవం జరుగుతోంది. ఎండవేడి దుర్భరంగా వుంది. తాగడానికి నీరులేదు. యాత్రికులు తండోపతండాలుగా అజ్మీరుకి వస్తున్నారు. బైదుల్ వరుసగా మూడు నాలుగు రోజులు చాచాను సమీపించి తనతో రావలసిందిగా ప్రార్థించాడు. చాచా నిరాకరిస్తూనే ఉన్నాడు. నిరాశచెందిన బైదుల్ చివరి ప్రయత్నంగా మే 31వ తేదీ సాయంకాలం మళ్ళీ చాచా దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు చాచా పెరుగు అన్నం, మాంసం తెచ్చిపెట్టమన్నాడు. అతను అలాగే చేసాడు. చాచా ఇంకా కావాలన్నాడు. మళ్ళీ బైదుల్ అవి తీసుకువస్తే తిని, ఐసు వేసిన చల్లని నీరు కావాలన్నాడు. చల్లటి నీరు త్రాగించాక బైదుల్ ధైర్యం కూడదీసుకుని మళ్ళీ తనతో రావలసిందిగా చాచాను చేయిపట్టుకు బ్రతిమాలాడు. అప్పుడు చాచా క్రింది వున్న మాసిన దుప్పటి భుజాన వేసుకొని బైదుల్ వెంట రైలు స్టేషన్‌కి వచ్చాడు. అప్పుడు అక్కడ జరుగుతున్న తిరునాళ్ళలో జనసందోహం తన దారికాటంకమని తలచి బైదుల్ స్టేషన్‌లోనికి వెళ్ళడానికే కష్టంగా వున్నందున, ఒక టాక్సీలో చాచాను తీసుకొని అక్కడికి 30 మైళ్ళ దూరంలో వున్న బీవార్ అనే ఊరికి వెళ్ళాడు. బీవార్‌లో ఒక రైలు ఎక్కించి మధ్యలో అనేక రైళ్ళు మారుతూ అంచెలంచెలుగా తనతో వున్న చాచా అనబడే అమూల్య సంపదను బాబాకు దగ్గరగా తీసుకుపోతున్నాడు. రైలు మారవలసిన ప్రతిచోట చాచాను వీల్‌ఛైర్‌లో కూర్చోపెట్టి త్రోసుకువెళ్ళి మరో రైలులో ఎక్కించేవాడు. ఇలా ప్రయాణిస్తూ జూన్ 30 నాటికి ఇద్దరూ సతారా చేరుకున్నారు. ఆ రోజు నుంచి బాబా చాచానే రోజూ కలుసుకునేవారు. సతారాలో వున్న అయిదు వారాలలో ఒక్కసారి కూడా చాచా బయటకురాలేదు. రోజంతా తనకలవాటైన ఆ మూలనే తలుపు కెదురుగా కూర్చొని అప్పుడప్పుడు తనంతట తానే కొన్ని గజాలు నడచివెళ్ళి ఎదుటి మూలలో కూర్చొనేవాడు. బాబా ప్రతిరోజు చాచాకు టీ, ఆహారము ఇచ్చి చాలాసేపు అతనితో

ఏకాంతంగా గడిపేవారు. ఆ రోజుల్లో ఆలీషాతో ఒకటి రెండు గంటలూ తరువాత చాచాతోను ఏకాంతంగా గడపి ఇచ్చిన తరువాత బాబా చాలా నీరసంగాను, పీక్కుపోయిన ముఖంతో, ఒళ్ళంతా చెమటలుపట్టి తడిసిన బట్టలతోను కనిపించేవారు. ఈ ఇద్దరు గొప్ప మస్తులతో తాను మౌనంగా ఏకాంతంలో చేసిన కార్యక్రమంలో తన అనంత శక్తిని దేహమనే దర్పణం ద్వారా ప్రసరింపజేయడం వలన అలసట చెందేవారనుకోవచ్చు. ఒకరోజు చాచా భౌతిక జీవితానికి సంబంధించి స్పందించిన విధానం తెలిపే ఒక సంఘటన జరిగింది. ఒకరోజు ప్రొద్దున్న బాబా చాచాకు టీ ఇచ్చేటప్పుడు, అతడు ఇంకా టీ కావాలని తెప్పించి అది బాబాకిచ్చి త్రాగమన్నాడు. అలా ఒక డజను కప్పుల టీ త్రాగిన తర్వాత ఇంక త్రాగలేక బాబా చాచా టీ తెమ్మనప్పుడల్లా కప్పు సాసరు గది బయటకు తీసుకువెళ్ళి, కప్పునిండా టీ ఉన్నట్లు నటించుచూ జాగ్రత్తగా చాచాకు అందించేవారు. చాచా అది తీసుకుని వంచి సాసరులో టీ పోసినట్లు నటించి బాబాకిచ్చి త్రాగమనేవాడు. బాబా కూడా టీ త్రాగినట్లు పెదవులకానించేవారు. ఇలా ఈ నాటకం సుమారు యాభైసార్లు జరిగింది. జూలై మొదటివారంలో చాచాతో తన పని పూర్తయిందని బాబా చెప్పారు. జూలై 10వ తేదీన బైదుల్ చాచాతో తిరిగి అజ్మీరు ప్రయాణమయ్యాడు. అజ్మీరు చేరగానే చాచా చాలా ఆనందించాడు. స్వయంగా బండిదిగి ప్లాట్‌ఫారం మీద చకచకా నడచి స్టేషను బయటకు వెళ్ళి ఒక టాంగాలో ఎక్కి కూర్చున్నాడు. బైదుల్ కూడా తనపని నెరవేరినదని సంతోషించి తను కూడా టాంగాలో చాచా ఉండే గది దగ్గరకు వెళ్ళారు. అయితే టాంగా నుండి క్రిందకి దిగడానికి చాచా నిరాకరించాడు. ఎన్ని విధాల బ్రతిమాలినా వినలేదు. గుర్రానికి దాణా, నీరూ ఇచ్చే సమయమైందని టాంగావాడు చెప్పినా చాచా బండిదిగలేదు. ఆఖరికి టాంగావాడు గుర్రాన్ని విప్పి బండికాడిని నేలకు ఆన్చాడు. అయినా చాచా బండిదిగలేదు. బైదుల్ మెల్లగా కాడిఎత్తి చాచా క్రిందికి జారే విధంగా చేసాడు. అజ్మీరు ప్రజలకు చాచా సతారా మెహెర్‌బాబా వద్దకు వెళ్ళినట్లు తెలియదు. ఇప్పుడు తెలుసుకొని చాచా తిరిగి తమ ఊరికి వచ్చినందుకు సంతోషించారు. అక్కడి వారు మాట్లాడుతూ, చాచా ఊళ్ళోలేని సమయంలో చాచాను ప్రేమించి గౌరవించే అజ్మీరులోని ఒక కంసాలి ప్రతిరోజు చాచా గదికి వచ్చి ఏడుస్తూ కూర్చుండేవాడని చెప్పారు. చివరికి ఈ గొప్ప మజ్జూబ్ అజ్మీరుకి తిరిగివచ్చాడు. చాచాకు బాబాకు మధ్యవున్న బంధము కారణంగా గతంలోవలె బాబా మరల మురికితో కూడిన చాచా గదికి రావడమో లేదా చాచాను తన దగ్గరకు పిలిపించుకోవడమో జరుగుతుందని వారు తలపోసారు. "భగవద్భక్తుడు మట్టిలోని మాణిక్యము వంటివాడు".

***

**మెహెర్‌బాబా మెచ్చిన ఐద్గురు మస్తుల క్రమంలో చాచా మస్తుతో ఈ శీర్షిక ముగిసింది.**

**ప్రతిఒక్కరూ చదవవల్సిన గ్రంధం. తెలుగువారింట ఉండవల్సినదీను!**

# బాటసారులు




ఈ గ్రంధాన్ని **THE WAYFARERS - MEHER BABA WITH THE GOD INTOXICATED** అని ఇంగ్లీషులో తొలిసారిగా 1948లో పాశ్చాత్య బాబా మండలి ప్రేమికుడు - **విలియం డాంకిన్** ముద్రించారు. ఈ గ్రంధానికి తొలిపలుకులు మెహెర్‌బాబా స్వయంగా రాశారు. అంతేకాదు, ఈ పుస్తకంలోని అన్ని అంశాలు మెహెర్‌బాబా స్వయంగా పరిశీలించి తగిన సూచనలు – మార్పులు చేర్పులూ కూడా చేశారు. కఠిన మౌనంలో వుండి మన దేశంలో కొన్ని వేల మైళ్ళ దూరం అలుపెరుగక అనేక ఇక్కట్లు ఎదుర్కొని ప్రయాణం చేసి, పిచ్చివాళ్ళ లాగా కనిపించే భగవదున్మత్తులతో మెహెర్‌బాబా నెరిపిన సాంగత్యాన్ని కళ్ళకు కట్టినట్లు ఈ గ్రంధంలో విలియం డాంకిన్ మెహెర్‌బాబా ప్రేమికులందరి కోసం అందజేశారు. అవతారుని కార్యక్రమాలలో మస్తు జనోద్ధరణ అత్యంత ప్రధానమైంది. 1938 నుండి 1948 వరకూ సుమారు ఒక దశాబ్ద కాలం మెహెర్‌బాబా 75 వేల మైళ్ళు ప్రయాణించి 25 వేల మంది మస్తులను కలిసారు. కాగా ఇంగ్లీషులో వున్న ఈ గ్రంధాన్ని బాబా ప్రేమికులు శ్రీ టి. కుటుంబశాస్త్రి గారి కుమారుడు, **శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ**, తెలుగులో అనువదించి – జూన్ 2012లో ప్రచురించారు. ఆధ్యాత్మిక గ్రంధమైన **బాటసారులు గ్రంధాన్ని** చక్కని సరళ, వ్యావహారిక తెలుగులో పాఠకులందరికీ అర్థమయ్యేలా రాశారు. ఒరిజినల్ ఆంగ్ల ప్రతికి సరైన నమూనాగా ఈ గ్రంధం ఉంది. మస్తుల యాత్రకు సంబంధించిన మ్యాపును కూడా అదనంగా పుస్తకంతో రచయిత అందజేశారు. గతంలో బాటసారులు పేరిట ముద్రించిన అనువాద గ్రంధాలు ప్రస్తుతానికి అలభ్యంగా వున్నాయి. ఆధ్యాత్మిక జిజ్ఞాసువులు, పుస్తక ప్రియులు తప్పక చదవవల్సిన గ్రంధం– **బాటసారులు.** ప్రతి ఇంటా తప్పక ఉండవల్సిన 800 పేజీల ఉద్గ్రంధమిది. **పుస్తక ప్రాప్తిస్థానం:**

**Tadimeti Akbar Krishna,**
**TAPESHWARAM - 533 340,**
**East Godavari District, ఫోన్. 08855-230581**

# బాబా కార్యకర్తలు-కావలసిన అర్హతలు

(వి.ఆర్.కె. శాస్త్రి, మల్కాజిగిరి)

**ఇది 1959 ఆగస్టు 13 నాటి మాట.**

ఆ రోజున బాబా అహ్మద్‌నగర్ మెహెర్‌బాబా సెంటర్ ప్రేమికుల్ని మెహెరాజాద్‌కు రమ్మనమన్నారు. స్థానిక బాబా ప్రేమికులు, స్త్రీ, పురుషులందరూ కలిసి సుమారు యాభై మంది బాబా దగ్గరకు వెళ్ళారు. బాబా ఎదుట వారు కొంతసేపు భక్తి గీతాలు ఆలాపించారు. **భయ్యా పాండే** అనే బాబా ప్రేమికుడు అహ్మద్‌నగర్ కేంద్రానికి బాబావారి నిలువెత్తు తైలవర్ణ చిత్రాన్ని బహుకరించాడని, స్థానిక సెంటర్ కార్యదర్శి రంగోలె బాబాకు చెప్పాడు. ఆ మాటా – ఈ మాటా అయ్యాక సెంటర్‌లో జరుగుతున్న కార్యక్రమాల బాగోగుల గురించి బాబా వాకబు చేశారు.

బాబా ప్రేమికులందరూ సఖ్యతగా, ప్రేమగా వుంటున్నారా? అని ప్రశించారు.

అపార్థాలు ఏమీ లేవు కదా? అని బాబా రంగోలీని అడిగారు.

చిన్నిపాటి తగవులయితే వున్నాయని, రంగోలే ఉన్న వాస్తవాన్ని బాబాకు చెప్పాడు.

"చిన్నిపాటి తగువులుండటం మంచిదే!! కాని అపార్థానికి చోటివద్దని బాబా అన్నారు.

ఈ విషయమై బాబా మరింత వివరణ ఇచ్చారు."**అల్పబుద్ధిని** మానుకోమన్నారు.

నా ప్రేమికుల మధ్య తగవులుంటే బాబా కేంద్రం యొక్క ఉపయోగం ఏముందన్నారు.

మీ హృదయం పవిత్రంగా వుండి, మీకు నా యెడల ప్రేమ వున్నప్పుడు మాత్రమే మీరు '**అవతార్ మెహెర్‌బాబాకి జై** అని చెప్పగల్గుతారు.

అప్పుడు మీరు చెప్పు **జై,** హృదయలోతుల నుండి వస్తుంది కాబట్టి, అది చాలా స్వాభావికంగా వుంటుంది. ప్రతి చిన్న విషయానికీ తగాదా పడుతూ వుండే వందమంది కంటే, నిజాయితీ గల ప్రేమికులు పట్టుమని పదిమంది వున్నా చాలన్నారు బాబా. ఒకరిపట్ల ఒకరు ప్రేమగా, నిజాయితీగా, సఖ్యతగా వుండండి.

బాబా కేంద్ర సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరుకమ్మనమని బాబా సూచించారు.

ఆర్థిక విషయాలు గురించి కూడా బాబా ప్రస్తావిస్తూ,

ఎవరి పేరున బ్యాంకు ఖాతా నిర్వహించాలో

స్థానిక నిర్వాహకులే నిర్ణయించాలన్నారు.

నేను చెబుతున్నట్లు నిజాయితీగా, ప్రేమగా మీరు సెంటర్‌ను నిర్వహిస్తే

మీకెలాంటి ఆర్థిక లోటు వుండదని బాబా హితవు చెప్పారు.

నా సలహా పాటించండి.

మీకెలాంటి ఇబ్బందులు ఉండవు.

లేనిపక్షంలో కేంద్ర నిర్వహణ కూడా అమిత భారమౌతుంది.
తెలుగునాట నా ప్రేమికులు నా కార్యక్రమాలెన్నో చేపడుతున్నారు.
అందుకు కొన్ని కష్టాలు కూడా అనుభవిస్తున్నారు.
అలాగే, అక్కడి వారిలో కొద్దిపాటి అభిప్రాయబేధాలున్నాయి.
అందుకు కారణం వారికి నాయందు గల ప్రేమ మాత్రమేనని గమనించాలన్నారు.
ఇందుకు మరొకటి మరొకటి కారణం ఏమీ లేదని వివరించారు.
బాబా సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలకు తప్పక
హాజరవ్వమని ఎవ్వరినీ బలవంతం చేయొద్దు.
మీ సమావేశములకు హాజరవవలెనని ఎవరినైన బలవంతం చేయడము కాని,
మీ అభిప్రాయములను అతని మీద రుద్దడం కాని చేయొద్దు.
నా సహవాసము మీకు లభించినంతగా హమీర్‌పూర్ ప్రేమికులకు లభించదు.
కాని వారి ప్రేమ గాఢమైనది.
నేను అక్కడ వివిధ ప్రదేశములను సందర్శించిన రోజుని పురస్కరించుకుని,
ప్రతి సంవత్సరం హమీర్‌పూర్ ప్రేమికులు ఒక పెద్ద ఉత్సవం జరుపుతున్నారు
(ప్రతి సంవత్సరం నవంబరు 16 నుండి 28 వరకు).
పాశ్చాత్య దేశములలో, నా ఒక్క మాటతో
వారి ప్రాణాలు త్యాగం చేయడానికి సిద్ధంగా వున్న ప్రేమికులు ఎందరో వున్నారు.
అవతారుడు బాధననుభవించి తీరాలన్నది యుగధర్మం.
నేను అవమానపరచబడు సమయం సమీపిస్తోంది.
నేను దానిని గురించి సంతోషిస్తున్నాను.
మీరు భగవంతుడిని ప్రేమించవలెనన్నదే నా ఇచ్ఛ.
ఆరంభంలేని ఆరంభం నుండి (అనంత కాలం నుండి)
నేను పరమాత్మను, పరబ్రహ్మ పరమాత్మను.
నా సత్య స్థితి, నా నిజస్థితిని మీరు లేశమాత్రం దర్శించుకున్నా,
మీరు అహ్మద్‌నగర్ వీధుల్లో నగ్నంగా తిరుగుతారు.
నేను సాక్షాత్తూ ఈ యుగావతారుడిని.
ఈ విషయంలో ఎలాంటి అపనమ్మకం వద్దు.
నేను దేనికి ప్రభావితుడను కాను. నా గురించి చర్చించడం,
ప్రజలను మీ ఆలోచనా మార్గంలోనికి తీసుకురావడం బాగానే వుంటుంది.
మెహెర్‌బాబా గురించి పలువురికి తెలియజెప్పడమే మీ పని.
అలాగే, రాముని యెడల గల భక్తికి,
బాబా యెడల గల భక్తికి బేధం ఏమీ లేదని స్పష్టం చెయ్యాలి.

'జైరామ్, జైబాబా'..... వీటి గురించి తగవులొద్దు.
నా యందు ప్రజలకు విశ్వాసం వుంటే ఒకరినొకరు కలిసినప్పుడు
గౌరవ సూచనగా 'జై బాబా' అనడం ప్రారంభిస్తారు.
ఇలా హమీర్‌పూర్‌లో ఇప్పటికే జరుగుతోంది.
బాబా మానవరూపంలో వున్న భగవంతుడను విషయంలో
ఏ మాత్రం సందేహం వద్దు.
ఆసక్తిగల వారికి ఈ విషయం వివరించి చెప్పండి.
వాళ్ళు శ్రద్ధగా వినకపోతే చెప్పడం మానెయ్యండి.
ప్రతి బాబా కేంద్రంలో చిన్నిపాటి తగవులున్నాయి.
అది కేవలం నాయందు గల ప్రేమ వల్లనే తలెత్తుతున్నాయి.
అహ్మద్‌నగర్ సెంటర్ కార్యదర్శి రంగోలె గురించి బాబా ప్రస్తావిస్తూ,
రంగోలేని కొందరు వ్యతిరేకించేవారుంటారు.
అతడ్ని పరోక్షంగా విమర్శించే వారూవుంటారు.
తానేదో చిక్కుల్లో చిక్కాననీ రంగోలే భావించొచ్చు.
**బాబా రంగోలేకేసి తిరిగి చూస్తూ...**
నీవు బాబా సెంటర్ కార్యదర్శిగా వున్నావు.
కాబట్టి, నీవు కొందరిచేత చెప్పుదెబ్బలు తినడానికైనా సిద్ధంగా వుండాలి.
అలాంటి ఆపత్తు సమయంలో కూడా నీకు కోపం రాకూడదు అని బాబా హితవు
చెప్పారు. అలాంటి సమయంలో నిరాడంబరంగా తలదించుకుని
భరించడం అలవరచుకో!! నీవు కోపాన్ని అదుపులో వుంచుకొనగలిగితే,
నేను నా శిరస్సు వంచి నీకు ప్రణామం చేస్తానని" బాబా అన్నారు.
నిజాయితీ లేకపోవుట, సఖ్యత లేకపోవుట,
అపార్థం చేసుకొనుట, అసమ్మతి - ఈ నాలుగు లక్షణాలు లేశమాత్రంగానైనా
**మెహెర్‌బాబా కార్యకర్తలు, నిర్వాహకులకు వుండరాదని**
**బాబా తన ప్రేమికులను ఉద్దేశించి చెప్పారు.**
**వీటికి బదులుగా**
ప్రేమ, హృదయ పవిత్రత,
విశాల దృక్పథం, సఖ్యత -
ఈ నాలుగు లక్షణాలు తప్పక ప్రతి ప్రేమికునికి వుండాలని బాబా ఆకాంక్షించారు.
బాబావారి ఈ సూచనలు
ప్రతి బాబా ప్రేమికునికి ప్రాతస్మరణీయం కావాలి!!

****

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యత్వం

**2015 ఆగష్టు-సెప్టెంబర్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | ఆగష్టు | ఎస్.వి.ఎస్. త్రిలోక్, విశాఖపట్నం | రూ. 1000.00 |
| 2. | ఆగష్టు | టి. సూర్యప్రకాష్, నిజామాబాద్ | రూ. 1000.00 |
| 3. | ఆగష్టు | జి. నారాయణాచారి, నిజామాబాద్ | రూ. 1000.00 |
| 4. | ఆగష్టు | యం. మురళి, విశాఖపట్నం | రూ. 500.00 |
| 5. | ఆగష్టు | ఎ. ససురేందర్ రెడ్డి, హైదరాబాద్ | రూ. 1000.00 |
| | | **మొత్తం** | **రూ. 4500.00** |

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973,**
**IFSC CODE: IOBA 0001732.**

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,
బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218. **email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month, Posted at Patrika Channel on 19 / 20th every month.